జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.


ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 20 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 196 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com





# సునీతకు సెల్యూట్

ఇప్పటివరకూ ఆమె 608 రోజులు అంతరిక్షంలో గడిపి ఘనత సాధించారు

సునీతా విలియమ్స్ భూమిపైకి సురక్షితంగా తిరిగి రావటం శుభపరిణామం

సునీతకు ఇది మూడో అంతరిక్ష యాత్ర

శాస్త్రీయ పరిశోధనలపై సునీతకు ఉన్న ఆసక్తి, పట్టుదల..

వ్యోమగాములపై సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్..

ప్రజాజ్యోతి అమరావతి

నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బారీ విల్మోర్ సురక్షితంగా భూమికి తిరిగి రావడంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ నుంచి 286 రోజుల తర్వాత ఎట్టకేలకు వారిద్దరూ పుడమిపైకి తిరిగి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. సునీతా, విల్మోర్ ప్రయాణం ఆదర్శప్రాయమైన మానవ సంకల్పం, జట్టు కృషిని చూపిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. వారిద్దరూ తిరిగొచ్చేలా కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వ్యోమగాముల బలం, పట్టుదలకు తాను సెల్యూట్ చేస్తున్నట్లు చెప్పారు. - మిగతా3లో



## భూమి మిమ్మల్ని మిస్ అయ్యింది

- ఇది సహనం, ధైర్యం, అపరిమిత మానవ స్ఫూర్తికి పరీక్ష
- వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది
- అంతరిక్ష పరిశోధన అంటే మానవ సామర్థ్య సరిహద్దులను అధిగమించడం
- సునీతా విలియమ్స్ ఒక ట్రైల్‌బ్లేజర్(ఆవిష్కర్త)..
- తన కెరీర్ మొత్తంలో ఈ స్ఫూర్తిని ప్రదర్శించిన ఐకాన్.

# ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్

విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల కోసం నిధుల మంజూరు

కేంద్రం సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎంపిక

ఈ రెండు నగరాల్లో సమగ్ర మొబిలిటీ ప్లాన్ రూప కల్పన కోసం సిస్ట్ర ఎంవీఏ సంస్థను ఎంపిక



ప్రజాజ్యోతి అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల సీఎంపీ కోసం కేంద్రం బుధవారం నిధులు మంజూరు చేసింది. ఈ రెండు మెట్రో ప్రాజెక్టులకు ఇచ్చిన మొబిలిటీ ప్లాన్ గడువు ఐదేళ్లు దాటి పోయింది. ఈ నేపథ్యంలో తిరిగి మరోసారి ఈ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం కోరింది. కేంద్రం సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎంపిక చేసింది. ఈ రెండు నగరాల్లో సమగ్ర మొబిలిటీ ప్లాన్ రూప కల్పన కోసం సిస్ట్ర ఎంవీఏ సంస్థను ఎంపిక చేసింది. విశాఖపట్నంలో రూ. 84.47 లక్షలు, - మిగతా3లో



## భీమ్-యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు

- యూపీఐ లావాదేవీలపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం!
- భారత్‌లో యూపీఐ లావాదేవీలు 210 లక్షల కోట్లకు చేరాయి.
- ప్రతి రెండు వేల రూపాయల లోపు లావాదేవీలకు 0.15శాతం ఇన్సెంటివ్ అందించనుంది
- దీంతో పాటు చిరు వ్యాపారుల్ని ప్రోత్సహించేందుకు రూ.1500 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ నిర్ణయం

# లోకేశ్‌కు పార్టీలో భారీ ఇమేజ్

- క్యాడర్‌కు ఆశాజనకంగా మంత్రి నారా లోకేశ్
- లోకేశ్ ఏడాదిన్నర పాటు యువగళం పాదయాత్ర జరిపినప్పుడు కూడా క్యాడర్‌కు దగ్గరయ్యారు
- వీలయినంత త్వరగానే క్యాడర్‌ను తృప్తి పర్చేందుకు ప్రయత్నిస్తారని
- మే నెలలో కడపలో జరగనున్న మహానాడులో లోకేశ్ కు కీలక బాధ్యతలను అప్పగించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తుంది.



ప్రజాజ్యోతి విజయవాడ

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు క్యాడర్ కు ఆశాజనకంగా ఉన్నారు. లోకేశ్ తోనే సాధ్యమవతుందని క్యాడర్ బలంగా నమ్ముతుంది. చంద్రబాబు నాయుడు చట్టాలు, చట్టుబండలంటూ కాలయాపన చేస్తారని, లోకేశ్ మాత్రం గత వైసీపీ ప్రభుత్వంలో తమపై జరిగిన కక్ష సాధింపు చర్యలకు దిగిన దానికి ప్రతీకారం తీర్చుకోవాలంటే నారా లోకేశ్ వల్లనే సాధ్యమవుతుందని గట్టిగా విశ్వసిస్తున్నారు. లోకేశ్ ఏడాదిన్నర పాటు యువగళం పాదయాత్ర జరిపినప్పుడు కూడా క్యాడర్ కు దగ్గరయ్యారని, వారి మనోభావాలను తెలుసుకుని వీలయినంత త్వరగానే క్యాడర్ ను తృప్తి పర్చేందుకు ప్రయత్నిస్తారని చెబుతున్నారు. టీడీపీ సోషల్ మీడియాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మే నెలలో కడపలో జరగనున్న మహానాడులో లోకేశ్ కు కీలక బాధ్యతలను అప్పగించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తుంది. రాజధాని పనులను గత ప్రభుత్వ హయాంలో... గత ప్రభుత్వ హయాంలో - మిగతా3లో



## ఎవరికి నచ్చినా నచ్చకపోయినా టారిఫ్‌ల విధింపు వాస్తవమే

- శక్తిమంతమైన దేశంగా మారే క్రమంలో వాణిజ్య సంబంధాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి
- నిజానికి గత దశాబ్దాన్ని గమనించినట్లయితే.. గొప్ప ఆయుధీకరణను చూశాం
- ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం
- ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం.
- దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు అంతర్జాతీయ సంబంధాల్లో నియంతృత్వ ధోరణి తగ్గిందనే భావిస్తున్నాం
- కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు



## ఆ డేటా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది

- పదవీ విరమణ వయసును మార్చే ప్రతిపాదనలు ఏమీ లేవు
- ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మాత్రమే సూచిస్తుంది
- పదవీ విరమణ వయసును పెంచనున్నారని వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు మార్పుపై లోక్‌సభలో కీలక ప్రకటన చేసిన కేంద్రమంత్రి..!

# మర్రి రాజశేఖర్‌కు బుజ్జగింపులు!

చిలకలూరిపేట ఇన్‌చార్జిగా విడదల రజనీని నియమించడం పట్ల మర్రి రాజశేఖర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం

రజనీని వైసీపీ ఇన్‌చార్జిగా నియమించిన నాటి నుంచి వైసీపీకి దూరంగా ఉంటూ వస్తున్న మర్రి

వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి బుజ్జగించినప్పటికి ఆయన అసంతృప్తిలోనే ఉన్నారు.

వైసీపీకి రాజీనామా చేసిన ఆయన త్వరలో తెలుగుదేశం గూటికి వెళ్లనున్నట్లు సమాచారం

ప్రజాజ్యోతి అమరావతి

వైసీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ రాజీనామా ఇప్పుడు అసెంబ్లీలో హాట్‌టాపిక్‌గా మారింది. వైసీపీకి రాజీనామా చేసిన మర్రి.. కాసేపటి క్రితమే శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కోరారు. మర్రి రాజశేఖర్ పదవీకాలం 2029 వరకూ ఉంది. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన త్వరలో తెలుగుదేశం గూటికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే.. రాజీనామాకు సిద్ధమైన రాజశేఖర్‌ను బుజ్జగించేందుకు ప్రయత్నించారు వైసీపీ నేతలు. రాజీనామాను ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ - మిగతా3లో



# భూమి మిమ్మల్ని మిస్ అయ్యింది



**న్యూఢిల్లీ:** తొమ్మిది నెలలు అంతరిక్షంలో గడిపిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్మోర్ బుధవారం తెల్లవారుజామున భూమికి తిరిగి వచ్చారు. అంతరిక్ష నౌకలో లోపం కారణంగా, వారు తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలోనే ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు అక్కడి నుంచి తిరిగివచ్చిన వీరికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లకు స్వాగతం పలుకుతూ 'భూమి ఇన్నాళ్లూ మిమ్మల్ని మిస్ అయ్యింది' అని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ తాను సునీతా విలియమ్స్‌తో పాటు ఉన్న ఫొటోను షేర్ చేస్తూ ఇలా రాశారు 'స్వాగతం, #Crew9! భూమి మిమ్మల్ని మిస్ అయింది. ఇది సహనం, ధైర్యం, అపరిమిత మానవ స్ఫూర్తికి పరీక్ష. సునీతా విలియమ్స్, #Crew9 వ్యోమగాములు పట్టుదల అంటే ఏమిటో మనకు మరోసారి చూపించారు. వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది. అంతరిక్ష పరిశోధన అంటే మానవ సామర్థ్య సరిహద్దులను అధిగమించడం. కలలు కనే ధైర్యం.. ఆ కలలను నిజం చేసే ధైర్యం కలిగి ఉండటం. సునీతా విలియమ్స్ ఒక ట్రైల్‌బ్లేజర్(ఆవిష్కర్త).. తన కెరీర్ మొత్తంలో ఈ స్ఫూర్తిని ప్రదర్శించిన ఐకాన్. ఆమె సురక్షితంగా తిరిగి రావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారందరినీ చూసి చాలా గర్వపడుతున్నాను. ఖచ్చితత్వం, అభిరుచిని కలగలిస్తే.. సాంకేతికత పట్టుదలను కలబోస్తే ఏమి జరుగుతుందో ఆమె నిరూపించారు' అని ?ప్రధాని మోదీ పేర్కొన్నారు.

సునీతా విలియమ్స్ భారత సంతతికి చెందిన వ్యోమగామి. ఆమెకు ఇది మూడవ అంతరిక్ష ప్రయాణం. సునీత ఇప్పటివరకు మొత్తం 608 రోజులు అంతరిక్షంలో గడిపారు. సునీత 1965, సెప్టెంబర్ 19న ఒహియోలోని యూక్లిడ్‌లో జన్మించారు. అతని తండ్రి దీపక్ పాండ్య గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాలోని ఝులసన్‌కు చెందినవారు. అత్యధికంగా అంతరిక్షంలో నడిచిన మహిళగా విలియమ్స్ రికార్డు సృష్టించారు. సునీతా విలియమ్స్ 2007,2013లలో భారతదేశాన్ని సందర్శించారు. 2008లో సునీతకు పద్మభూషణ్ అవార్డు లభించింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సునీతా విలియమ్స్ కు ఒక లేఖ రాస్తూ, ఆమెను భారత పుత్రిక అని అభివర్ణించారు. ప్రధాని మోదీ సునీతను ఈ లేఖలో భారత్‌కు రావాలంటూ ఆహ్వానించారు.

# ఎవరికి నచ్చినా నచ్చకపోయినా టారిఫ్‌ల విధింపు వాస్తవమే



విదేశాలపై టారిఫ్‌లు, ఆంక్షల విధింపునకు సంబంధించి కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా ఆ నిర్ణయాలు నిజమేనని చెప్పారు. శక్తిమంతమైన దేశంగా మారే క్రమంలో వాణిజ్య సంబంధాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రైసీనా డైలాగ్ -2025లో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వాణిజ్య పరిమితులు, టారిఫ్‌లు, ఆంక్షలు వంటి వాటికి భారత విదేశాంగ విధానంలో చోటుందా..? అని కేంద్ర మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి బదులిస్తూ.. 'మీరు నమ్మినా నమ్మకపోయినా.. సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలుచేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని గమనించినట్లయితే.. గొప్ప ఆయుధీకరణను చూశాం. ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే వాణిజ్య, వ్యాపార సంబంధాల కోసం దేశాలు పోటీపడుతున్నాయి.' అన్నారు.

ఈ సందర్భంగా అంతర్జాతీయ సంబంధాలను జైశంకర్ ప్రస్తావించారు. దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు అంతర్జాతీయ సంబంధాల్లో నియంతృత్వ ధోరణి తగ్గిందనే భావిస్తున్నానని అన్నారు. నేడు చాలా వరకు విభజన రేఖలు చెరిగిపోయాయని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. భారత్‌పై అమెరికా సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చిన నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ అత్యధిక స్థాయిలో సుంకాలు విధిస్తోందని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఆయన యూఎస్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ.. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా పలు దేశాలపై పరస్పర సుంకాలు అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. దీనిపై వెనక్కి తగ్గే అవకాశమే లేదని చెప్పారు.

# ఒసామాబిన్ లాడెన్ ప్రస్తావన చేసిన ఏక్‌నాథ్ షిండే



**ముంబై:** మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధి తొలిగించాల్సిందేనంటూ జరుగుతున్న వివాదం ముదురుతోంది. ఈ అంశంపై మహారాష్ట్ర శాసనమండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య బుధవారంనాడు గందరగోళం చెలరేగింది. దీనిపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథా షిండే మండలిలో మాట్లాడారు. ఔరంగబేజ్‌ను కొందరు కొనియాడుతుండటంపై విసుర్లు విసిరారు. ఔరంగజేబును ఒసామాబిన్ లాడెన్‌తో పోల్చారు. తమ గడ్డపై ఒసామాబిన్ లాడెన్‌ను పూడ్చిపెట్టేందుకు అమెరికా నిరాకరించిందని, అతని మృతదేహాన్ని సముద్రంలో గుర్తుతెలియని ప్రాంతంలో డిస్పోజ్ చేసిందని చెప్పారు. తద్వారా లాడెన్‌ను ఎవరూ కీర్తించకుండా అడ్డుకట్ట వేసిందని అన్నారు. ఔరంగజేబు సమాధిని తొలగించాలని ఓ వైపు రైట్ వింగ్ సంస్థలు డిమాండ్ చేస్తుంటే ఆయనను కీర్తించడం ఏమిటని షిండే నిలదీశారు. "ఔరంగబేబు ఎవరు? మన రాష్ట్రంలో ఆయనన కీర్తించడానికి మనం ఎందుకు అనుమతించాలి? రాష్ట్ర చరిత్రలో ఆయన ఒక మాయని మచ్చ" అని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మరాఠా రాజు ఛత్రపతి శంజీరాజేను ఇస్లాంలోకి మారాలని ఔరంగబేబు ఛాన్స్ ఇచ్చినా అందుకు శంభాజీ ఒప్పుకోలేదని, దీంతో ఆయనను చిత్రహింసపెట్టి మరీ చంపారని గుర్తుచేశారు. అమెరికా సైతం ఒసామా బిన్ లాడెన్‌ను ఎవరూ కీర్తించడానికి తావీయకుండా, సొంత గడ్డపై కాకుండా సముద్రం మధ్యలో అతని మృతదేహాన్ని పూడ్చేసిందని అన్నారు దేవేంద్ర ఫడ్నవిస్ పాలనను ఔరంగజేబు పాలనతో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ పోల్చడాన్ని కూడా షిండే తిప్పికొట్టారు. ఔరంగజేబు, ఫడ్నవిస్ ఒకటేనా అని నిలదీశారు. ఔరంగబేజు శత్రువుల పట్ల వ్యవహరించిన రీతిలో ఫడ్నవిస్ ఎప్పుడూ ఇతరుల పట్ల వ్యవహరించలేదని అన్నారు. ముఖ్యమంత్రి మీపట్ల అనుచితంగా ప్రవర్తించారా అని శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే అనిల్ పరబ్ వైపు తిరిగి ప్రశ్నించారు.

**నాగపూర్‌లో హింస**

ఔరంగబేజ్ సమాధిని తొలిగించాలనే వీహెచ్‌పీ డిమాండ్ల మధ్య ఒక మతగ్రంథం తగులబెట్టారనే వదంతులు వ్యాప్తి చెందడంతో గత సోమవారం సాయంత్రం నాగపూర్ మహల్ ఏరియాలో హింసాకాండ చెలరేగింది. దుండగులు పలు వాహనాలు, ఆస్తులకు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో 50 మందికి పైగా అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు. నాగపూర్ హింసాకాండ ముందస్తు కుట్ర జరిగిందా అనే దానిపై విచారణ జరుపుతున్నామని, ఈ ఘటనలో 34 మంది పోలీసులు కూడా గాయపడ్డారని ఏక్‌నాథ్ షిండే తెలిపారు.

# పోలీసులే దొంగను నిద్రలేపారు

**కర్ణాటక:** అర్ధరాత్రి వేళ ఇంటి చోరీకి వచ్చిన దొంగ ఆరవేసిన టవల్, పంచను చోరీ చేసి పక్కింటి మీద నిద్రించగా, మంగళవారం ఉదయం పోలీసులు అతనిని నిద్రలేపి ఠాణాకు తీసుకెళ్లారు. నవ్వు పుట్టించే ఈ తమాషా సంఘటన శివమొగ్గ నగరంలో జరిగింది. వివరాలు.. నగర శివార్లలోని సోమినకొప్ప టీచర్స్ కాలనీలో కుమార్ అనే వ్యక్తి ఇంటి పై అంతస్తులోకి ఓ యువ దొంగ చొరబడ్డాడు. అక్కడ ఉన్న బీరువాను తెరిచి చూడగా అందులో ఏమీ దొరకలేదు. టవల్, పంచ తదితర దుస్తులను తీసుకుని పక్కింటి మిద్దెపైన వాటిని పరచుకుని నిద్రించాడు. తెల్లవారగానే కుమార్ ఇంటి పైభాగంలో ఆరవేసిన దుస్తుల కోసం రాగా, గది తలుపులు, బీరువా తలుపులు తెరిచి ఉండటం గమనించి ఆశ్చర్యపోయాడు. పోలీసులకు సమాచారమిచ్చాడు, వెంటనే పోలీసులు వచ్చి చూడగా పక్కింటిపై నిద్రిస్తున్న దొంగ కనిపించాడు. వినోబానగర ఎస్ఐ సునీల్, సిబ్బంది ఆ దొంగను నిద్ర లేపి పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.



## భీమ్-యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు




ఢిల్లీ: కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భారత్‌లో యూపీఐ లావాదేవీలు 210 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో భాగంగా భీమ్-యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ప్రకటించింది. ప్రతి రెండు వేల రూపాయల లోపు లావాదేవీలకు 0.15శాతం ఇన్సెంటివ్ అందించనుంది. దీంతో పాటు చిరు వ్యాపారుల్ని ప్రోత్సహించేందుకు రూ.1500 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర కేబినెట్ నిర్ణయాలను కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. యూపీఐ లావాదేవీలు రూ. 210 లక్షల కోట్లకు చేరుకున్నాయి. రూ. 2 వేలు కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు ఎలాంటి ఛార్జీ లేవు. అయితే ప్రస్తుత యూపీఐ విధానంలో కస్టమర్ బ్యాంక్, ఫిన్‌టెక్ సంస్థ, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్, యాప్ సంస్థ ద్వారా 4 అంచెల్లో లావాదేవీలు పెరుగుతున్నాయి. తద్వారా లావాదేవీల్లో చార్జీలను భరించాల్సి వస్తోంది. రూ.1,500 కోట్లు ఇన్సెంటివ్ రూపంలో చిన్న లావాదేవీలకు ఛార్జీలు విధించడంలేదు'అని తెలిపారు. దీంతో పాటు పలు కీలక నిర్ణయ తీసుకుంది. వాటిల్లో

అసోంలో బ్రౌన్‌ఫీల్డ్ అమ్మోనియా యూరియా ఫ్యాక్టరీకి ఆమోదం
రూ.10,601 కోట్లతో అమ్మోనియా కాంప్లెక్స్ ఏర్పాటు
రూ.2,790 కోట్లతో దేశంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి పచ్చజెండా
గోకుల్ మిషన్‌కు రూ.3,400 కోట్లు కేటాయింపు
రూ.4,500 కోట్లతో మహారాష్ట్రలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆమోదం

## ఆ డేటా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది



ఉద్యోగుల పదవీ విరమణ వయసును మార్చే ప్రతిపాదనలు ఏమీ లేవని కేంద్ర మంత్రి జిత్రేందర్ సింగ్ బుధవారం వెల్లడించారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఉద్యోగుల పదవీ విరమణతో ఉత్పన్నమయ్యే ఖాళీలను భర్తీ చేసే విధానం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసులో మార్పులు చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు.. సంస్థలు పదవీ విరమణ వయసులో మార్పులు చేయాలని కోరారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. జాతీయ మండలి (జాయింట్ కన్సల్టేటివ్ మెకానిజం) సిబ్బంది వైపు నుంచి ఎలాంటి అధికారిక ప్రతిపాదన రాలేదన్నారు. కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు వివరాలు, పదవీ విరమణ వయసు తేడాలకు కారణాలను వివరించాలని కోరగా.. ఈ విషయం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని.. అలాంటి డేటా ఏదీ కేంద్రం ఉండదని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. గత కొద్దిరోజుల కిందట కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచనుందని వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఈ వార్తలను కేంద్రం ఖండించింది. పదవీ విరమణ వయసును పెంచనున్నారని వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఖాళీగా ఉన్న పోస్టులను సమయానుకూలంగా భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, ఆయా విభాగాలను ఆదేశిస్తున్నట్లు చెప్పింది.

## నాగపూర్ హింసాకాండ ప్రధాన సూత్రధారి అరెస్టు




**నాగపూర్:** మహారాష్ట్రలోని నాగపూర్‌లో మార్చి 17న రెండు గ్రూపుల మధ్య చెలరేగిన హింసాకాండ ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ హింసాకాండకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఫాహీమ్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. షాహీమ్ ఖన్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో నితిన్ గడ్కరిపై పోటీ చేశారు. ఇంతవరకూ పోలీసులు 50 మందిని అరెస్టు చేయగా, నాగపూర్‌లోని 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా రెండవ రోజైన బుధవారంనాడు కూడా కర్ఫ్యూ కొనసాగిస్తున్నారు. కాగా, నాగపూర్‌లో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోందని డీసీపీ రాహులవ్ మక్నికర్ తెలిపారు. 10 పోలీసు బృందాలు ఇంతవరకూ 50 మంది దుండగులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ కేసులో 19 మంది నిందితులను జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు (జేఎంఎఫ్‌సీ) రిమాండ్‌కు పంపింది. నాగపూర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండను రాష్ట్ర హోం మంత్రి యోగేష్ కదమ్ ఖండించారు. ఇది చాలా సీరియస్ అంశమని చెప్పారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీసీపీ స్థాయి అధికారులు, పోలీసు సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. గత మూడు నాలుగేళ్లుగా మహారాష్ట్రలో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులపై చర్యలను తీవ్రతరం చేశామన్నారు. కాగా, ప్రజలు ప్రశాంతతను పాటించాలని కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్ కోరారు. పరిస్థితిని సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రయత్నం కృషి చేయాలని, వాళ్ల నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా ప్రభుత్వం కట్టడి చేయాలని కోరారు. నాగపూర్ హింసాకాండలో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని నేషనల్ కాగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-ఎస్‌సీపీ) నేత రోహిత్ పవార్ సూచించారు.

హింసాకాండ ఇలా చెలరేగింది

మొఘల్ చక్రవర్తి ఔరంగబేబ్ సమాధి తొలగించాలనే డిమాండ్ నేపథ్యంలో ఒక మతానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని తగులబెట్టారనే వదంతులు చెలరేగడంతో నాగపూర్‌లో పలు చోట్ల హింసాకాండ చెలరేగింది. హసన్‌పురి ఏరియాలో ఆందోళనకారులు రెచ్చిపోయారు. పలు వాహనాలను, ఆస్తులకు నిప్పుపెట్టారు. ర్యాపిడ్ కంట్రోల్ ఫోర్స్ రంగంలోకి దిగి పలువురిని అదుపులోనికి తీసుకుంది. ర్యాపిడ్ కంట్రోల్ ఫోర్స్‌లోని మహిళా పోలీసు అధికారిపై అల్లరిమూక అసభ్యంగా ప్రవర్తించినట్టు ఎఫ్ఐఆర్ సైతం నమోదైంది. ఈనెల17వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు మొదలైన హింసాకాండ రాత్రి 11.30 వరకూ కొనసాగింది.

# మర్రి రాజశేఖర్‌కు బుజ్జగింపులు!

-మొదటిపేజీ తరువాయి

కోరారు. అయితే తాను నిర్ణయం తీసేసుకున్నట్లు తేల్చిచెప్పేశారు రాజశేఖర్. వైసీపీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కాగా.. చిలకలూరిపేట ఇన్‌చార్జిగా విడదల రజనీని నియమించడం పట్ల మర్రి రాజశేఖర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. రజనీని వైసీపీ ఇన్‌చార్జిగా నియమించిన నాటి నుంచి వైసీపీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి బుజ్జగించినప్పటికి ఆయన అసంతృప్తిలోనే ఉన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఘోరంగా ఓడిపోయిన రజనీని మరల చిలకలూరిపేట ఇన్‌చార్జిగా ఎలా నియమిస్తారని రాజశేఖర్ ప్రశ్నించారు. చివరకు వైసీపీకి గుడ్‌బై చెప్పేయాలని నిర్ణయించుకున్న ఆయన.. రాజీనామా పత్రాన్ని మండలి చైర్మన్‌కు అందజేశారు. కానీ మర్రి రాజశేఖర్ రాజీనామా చేస్తున్నారని తెలిసిన వెంటనే లాబీలో ఆయనతో మాట్లాడేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. రాజీనామా చేయాలని నిర్ణయం తీసేసుకున్నట్లు వారికి తేల్చి చెప్పేశారు రాజశేఖర్. ఇప్పటి వరకూ నలుగురు ఎమ్మెల్సీలు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పోతుల సునీత, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, జయమంగళ



వెంకటరమణ వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. మర్రి రాజశేఖర్ రాజీనామాతో వైసీపీ అసంతృప్త ఎమ్మెల్సీల సంఖ్య ఐదుకు చేరింది. అయితే మర్రి రాజశేఖర్ బాటలో మరికొందరు వైసీపీ ఎమ్మెల్సీలు ఉన్నట్లు తెలుస్తోంది. నెక్స్ట్ ఎవరంటూ మండలి లాబీలో విస్తృత చర్చనడుస్తోంది.

**త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ: మర్రి**

శాసనమండలి లాబీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ... ప్రస్తుతానికి ఎమ్మెల్సీగా రాజీనామా చేసినట్లు తెలిపారు. వెంటనే ఆమోదించాలని కూడా చైర్మన్‌ను కోరానన్నారు. ఇప్పుడు చిలకలూరిపేట వెళ్లి వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు చెప్పారు. కార్యకర్తలతో మాట్లాడాక భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. ఆ తర్వాత రాజీనామాకు గల కారణాలపై అన్ని విషయాలు వెల్లడిస్తానని మర్రి రాజశేఖర్ తెలిపారు.

**ఎమ్మెల్సీల ఒత్తిడి...**

ఇదిలా ఉండగా.. ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేసిన ముగ్గురు ఎమ్మెల్సీలు.. చైర్మన్‌ను కలిసి రాజీనామాలను ఆమోదించాలని డిమాండ్ చేశారు. బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, జయమంగళం వెంకట రమణ వైసీపీకి గుడ్‌బై చెప్పేయగా.. ఇంతవరకు వారి రాజీనామాను చైర్మన్ ఆమోదించలేదు. దీంతో ఈరోజు టీ బ్రేక్‌లో చైర్మన్‌ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్సీలు తమ రాజీనామాను ఆమోదించాలన్నారు. దీనిపై స్పందించిన చైర్మన్ త్వరలోనే పరిశీలిస్తామని చెప్పారు. తమ రాజీనామాలను ఆమోదించాల్సిందేనని ఎమ్మెల్సీలు పట్టుబట్టారు.

# వెంటాడుతున్న పాపాలు

**తిరుపతి :** సరిగ్గా రెండేళ్ల క్రితం జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. ఆరోజే వైసీపీ ఓటమి ఖరారయింది. 2022 జులై లేదా ఆగస్టు నెలలో నలుగురైదు గురితో ఒక కీలక మీటింగ్ .. నాకు సన్నిహితుడైన ఒక అన్న నువ్వు కచ్చితంగా రావాలి అని తీసుకెళ్లాడు.. 2023 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మీద చర్చ నడిచింది.. అధికారపార్టీ పరిస్థితి బాగాలేదు అని అందరి అభిప్రాయం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగులుతుందని తేల్చి చెప్పారు.. ఆ కీలక నేత మాత్రం సర్వే చూద్దాం అంటూనే అయినా ఏమవుతుందిలే అనేశారు. ఈ మీటింగ్ జరిగిన రెండు నెలల తరువాత ఊహించని అభ్యర్థి ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలోకి వచ్చారు..పశ్చిమ రాయలసీమ మరియు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇద్దరూ నాకు సన్నిహితులే. రాజధాని పనులను సొంత ప్లానింగ్ తోనే... మరోవైపు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రచారం మీద మంచి రిపోర్ట్ అందుతుంది.. మంచి ప్లానింగ్ ,ఓట్ల ఎన్ రోల్ మెంట్ , ప్రతి మండల కేంద్రంలో ఆయన టీమ్ తరుపున మీటింగులు పెట్టడం .. పని బాగుంది.. ఎక్కడ కూడా టీడీపీ పెద్ద స్థాయి నాయకుల మీద ఆధారపడకుండా ఆయన టీమ్ పనిచేసుకుంటూ వెళ్తుంది.. గెలుపుకు ఏమి చేయాలో అది చేస్తున్నారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డితో వ్యక్తిగత పరిచయం లేదు కానీ ఆయన క్లాస్ మేట్స్ ,మిత్రులు చాలా మంది నాకు ఫ్రెండ్స్ .. మా శంకరన్న ,బి టెక్ రవి & భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి క్లాస్ మేట్స్ .. సో రాంగోపాల్ రెడ్డి గురించి బాగా తెలుసు మరో వైపు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చిన్నప్పుడు అంటే తాను చదివేటప్పుడు తెలుసు.. వాళ్ళ మేనమామ నాకు ఇంటర్లో క్లాస్ మేట్.. శ్రీకాంత్ తండ్రి ఈనాడు రామయ్య గురించి కూడా అప్పటి నుంచే తెలుసు.. ఈనాడు రామయ్య దగ్గుబాటి చంద్రబాబు వర్గాల వైరం మధ్య నలిగిపోయి ఏ పదవి పొందలేకపోయారు కానీ జిల్లాలో మంచి గుర్తింపు ఉన్న వ్యక్తి.. మా మార్కాపురం కూడా తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కిందికే వస్తుంది.. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా కుటుంబం కీలకంగా పనిచేస్తుంది.. మొదటి ఎమ్మెల్సీ (2007)విశ్వ బాలసుబ్రహ్మణ్యం మా తండ్రి కాలేజ్ మేట్స్. 2023 జనవరి వచ్చింది.. అధికార వైసీపీ అభ్యర్థుల ప్రచారం ఎవరికీ అర్థం కాలేదు.. ఒక నియోజకవర్గం పోవటం స్థానిక ఎమ్మెల్యేతో కలసి వంద రెండు వందల మందితో మీటింగ్ పెట్టటం జగన్ కోసం ఓటు వేయండని అడగటం.. ఒక టీమ్ కానీ వార్ రూమ్ కానీ లేకుండా ప్రచారం జరిగింది.. టీడీపీ అభ్యర్థుల గెలుపు జనవరికే నిర్థారణ అయ్యింది.. అనుకున్నట్లే సరిగ్గా రెండేళ్ల



కిందట ఇదే రోజు. 18 మార్చి 2023న కౌంటింగ్ జరిగింది ,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ మూడు వైసీపీ ఓడిపోయింది. విద్యా శాఖలో ఒక కీలక అధికారి ప్లానింగ్ వలన టీచర్స్ ఎమ్మెల్సీ లు రెండు వైసీపీ గెలిచింది.సరే.. ఎందుకు ఓడిపోయాం అని అంతర్మధనం జరిగిందా అంటే నాకు తెలిసి లేదు... మా ఓటర్లు వేరే ఉన్నారు అని సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందు అన్నారు.. అది సజ్జల గారి నిజమైన అభిప్రాయం కాకపోవచ్చు.. మీడియాకు ఏదో ఒక సమాధానం చెప్పాలి కాబట్టి ఆమాట అన్నారనిపించింది.. అప్పటి నుంచే పునాదులు... 2023 జనవరి నుంచే వైసీపీ ఓటమికి పునాదులు పడ్డాయి.. అప్పటి నుంచి టీడీపీ ప్రతి స్టెప్ 2024 అసెంబ్లీ ఎన్నికల గెలుపు వైపే పడింది.. వైసీపీ 2023 జనవరిలో మేలుకొని ఉంటే గెలిచినా గెలవకున్నా ఇంత ఘోరమైన ఓటమి పాలయ్యేది కాదు .మొన్న మార్చి రెండో తేదీన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గారిని ఒక పెళ్లిలో కలిసి మాట్లాడాను.. నాలుగో తారీఖున కౌంటింగ్ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మీద ఆయన అభిప్రాయం అడిగాను .. గుంటూరు-కృష్ణా & గోదావరి గ్రాడ్యుయేట్ గెలుస్తాం, ఉత్తరాంధ్ర టీచర్స్ ఓడిపోతాం అని చెప్పారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గోదావరి ఎమ్మెల్సీ ఎన్నికకు, కంచర్ల శ్రీకాంత్ గుంటూరు-కృష్ణా ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంచార్జులుగా పనిచేశారు.. ఉత్తరాంధ్ర టీచర్స్ లో అభ్యర్థి వీరి మాట వినలేదు.. అందుకే ఓడిపోతాం అని ఆయన అంచనా.. ఆయన అంచనాలు నిజమయ్యాయి.. పోలింగ్ రోజున... గుంటూరు-కృష్ణ పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణ్ రావు నాకు ,మా అన్నకు చాలా కాలంగా పరిచయం.. ప్రతి ఎన్నికకు ఆయనకు మేము చేయగల మద్దతు ఇస్తాం.. మొన్న కూడా ఫిబ్రవరి పదిహేను కలిశాను .. టీడీపీ బలాన్ని తట్టుకోగలమా అనే అనుమానం అందరిలో ఉంది. అనుకున్నట్లే పోలింగ్ రోజు అధికారపార్టీ బలాన్ని చూపించింది.. సార్ ఓడిపోయారు రెండుసార్లు టీడీపీ అభ్యర్థి మీదనే కావటం విశేషం. ఉత్తరాంధ్ర టీచర్స్ ఓటమి ప్రభుత్వానికి టీచర్స్ కర్రు కాల్చి వాత పెట్టారు అని నాటి ప్రతిపక్షం విమర్శించింది. ఈ మూడు అంటే టీడీపీ గెలిచిన రెండు గ్రాడ్యుయేట్ , ఓడిపోయిన టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితాలు ప్రభుత్వం మీద అభిప్రాయంగా చూడవలసిన అవసరం లేదు. సమర్థులైన నాయకులు.. ప్రభుత్వ పనితీరు అద్భుతంగా ఉంది కాబట్టి గెలిచారో ప్రభుత్వ పనితీరు బాగాలేదు అందుకే టీచర్స్ ఓడించారో భావించవలసిన అవసరం లేదు..ఆ స్థాయి అభిప్రాయాలు గ్రౌండ్లో ఇంకా ఏర్పడలేదు. టీడీపీ ఎన్నికలను ఎంత సీరియస్ గా తీసుకుంటుంది & ఏ స్థాయిలో ఎన్నికలు చేయగలదో ఈ ఫలితాలు చెబుతాయి.భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి & కంచర్ల శ్రీకాంత్ రూపంలో మాత్రం టీడీపీకి ఎన్నికలు చేయగలిగిన ఇద్దరు సమర్థమైన నాయకులు దొరికారు ... పూర్వ ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన కంచర్ల శ్రీకాంత్ మూడేళ్ళ నుంచి కుప్పంలోనే కాపురం ఉంటూ చంద్రబాబు గారి ఎన్నిక కోసం పనిచేశారు.. ఇప్పుడు కూడా అక్కడే ఉంటున్నారు.

# వైసీపీ నేతల మెడకు లిక్కర్ స్కాం

**కడప :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని విస్తృత ప్రచారం జరుగుతోంది. రాజకీయ ఎత్తుగడలతో పాటు ప్రత్యర్థులపై పై చేయి సాధించే క్రమంలో తాజా పరిణామాలు చోటు చేసుకుంటాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం ధరల్ని అమాంతం పెంచేసింది.సంపూర్ణ మద్య నిషేధంలో భాగమంటూ మద్యం విక్రయాలపై రకరకాల ప్రయోగాలు చేశారు. 2019 చివరిలో కొత్త లిక్కర్ పాలసీని వైసీపీ ప్రవేశపెట్టింది. మద్యం దుకాణాల స్థానంలో ప్రభుత్వమే మద్యం విక్రయించేలా వైన్ షాపుల్ని ఏర్పాటు చేశారు.ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం భారీగా పెరిగింది. అదే సమయంలో మద్యం బ్రాండ్లపై తీవ్ర విమర్శలు వచ్చాయి. పొరుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఏపీలో మద్యం ధరల్ని పెంచేశారు. 2019 మే నెలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు చేశారు. ఆ తర్వాత పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం రవాణా అధికం కావడం, నాటుసారా వినియోగం పెరగడంతో విధిలేని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాలతో సమానం చేశారు.ధరల్ని కొంత మేర తగ్గించిన మద్యం బ్రాండ్ల మతలబు మాత్రం ఐదేళ్ల పాటు సాగింది. జనం కోరుకునే బ్రాండ్లను కాకుండా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మే బ్రాండ్లను మాత్రమే కొనాల్సిన పరిస్థితి కల్పించారు. బ్రాండ్లతో సంబంధం లేకుండా రూ.150 నుంచి ధరల్ని ఖరారు చేసి మద్యాన్ని విక్రయించారు. దీంతో నాణ్యత లేని మద్యాన్ని కూడా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందనే ఆక్రోశం ప్రజల్లో పెరిగింది. ఊరు పేరు లేని బ్రాండ్లను ఊరూరా విక్రయించడంలో ప్రభుత్వ పెద్దలు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్టు సిట్ దర్యాప్తులో వెల్లడైంది.ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారు రాజ్ కసిరెడ్డి కనుసన్నల్లో ఈ కొనుగోళ్ల తతంగం నడిచింది. మద్యం విక్రయాలను కేవలం నగదును మాత్రమే అనుమతించడం ద్వారా ఎప్పటికప్పుడు ముడుపులు నేరుగా ప్రభుత్వ పెద్దలకు చేరే ఉంటాయని కూటమి ప్రభుత్వం అనుమానిస్తోంది. ఏపీబేవరేజీస్ కార్పొరేషన్ ఉద్యోగులను విచారించడంతో లిక్కర్ ఇండెంట్ల గుట్టు మాత్రం వీడింది. ఏ రోజు ఏ దుకాణానికి ఏ బ్రాండ్లు వెళ్లాలో కూడా ప్రభుత్వంలో కీలక వ్యక్తులే నిర్ణయించే వారు.మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో రూ.3వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ ముడుపుల్ని చివరిగా ఓ చోటకు చేరినట్టు సాక్ష్యాధారాలు లభించాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సన్నిహితుడు, ఎంపీ మిథున్ రెడ్డి వరకు చేరాయి. వైసీపీలో కీలకంగా ఉన్న నాయకుల్లో మిథున్ రెడ్డి కూడా ఒకరు. మరోవైపు మద్యం కొనుగోళ్లు, అక్రమాల వ్యవహారంలో వైసీపీ అగ్రనేతలపై కూడా చర్యలు ఉంటాయని విస్తృత ప్రచారం జరుగుతోంది. మద్యం ప్రయోజనాలన్ని అంతిమంగా ఒకే చోటుకు చేరాయని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి.జటిలం కాకినాడ సీ పోర్టు వ్యవహారంలో సీఐడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా లిక్కర్ సిండికేట్ల అంశాన్ని ప్రస్తావించారు. ఈ కేసుల్లో సాయిరెడ్డి అప్రూవర్‌గా మారుతారనే ప్రచారం కూడా జరుగుతోంది. సాయిరెడ్డి గుట్టు విప్పితే వైసీపీ పెద్దలు చిక్కుల్లో పడతారని ప్రచారం ఉంది.

## ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి

విజయవాడలో రూ. 81.68 లక్షలతో ప్లాన్‌ను సంస్థ రూపొందించనుంది. ఆయా పనుల కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం నిధులు మంజూరు చేసింది.

## సునీతకు సెల్యూట్

-మొదటిపేజీ తరువాయి

సునీత విలియమ్స్, బారీ విల్మోర్ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. మరోవైపు భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ బృందానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ అభినందనలు తెలిపింది.

సునీతా విలియమ్స్ భూమిపైకి సురక్షితంగా తిరిగి రావటం శుభపరిణామమని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. సునీతకు ఇది మూడో అంతరిక్ష యాత్రని, ఇప్పటివరకూ ఆమె 608 రోజులు అంతరిక్షంలో గడిపి ఘనత సాధించారని చెప్పుకొచ్చారు. శాస్త్రీయ పరిశోధనలపై సునీతకు ఉన్న ఆసక్తి, పట్టుదల.. క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయని ఆమె ధైర్య సాహసాలు ప్రశంసనీయమని కొనియాడారు.

## లోకేశ్‌కు పార్టీలో భారీ ఇమేజ్

-మొదటిపేజీ తరువాయి



అనేక మంది కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు. ఊళ్లను వదిలి పారిపోయారు. అక్రమ కేసుల్లో ఇరుక్కున్నారు. జైళ్లకు వెళ్లి వచ్చారు. యువగళం పాదయాత్రలోనూ, తర్వాత ప్రతి ఎన్నికల ప్రచార సభలోనూ లోకేశ్ బదులుకు బదులు తీర్చుకుంటానని హెచ్చరించారు. వడ్డీతో సహా చెల్లిస్తామని వార్నింగ్ ఇచ్చారు. రెడ్ బుక్ తయారవతుందని, అందులో జాబితా ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తూ క్యాడర్ ను పోలింగ్ కేంద్రాల వైపునకు వేగంగా నడిపగలిగారు. లోకేశ్ ఒక్కే వల్ల సాధ్యమవుతుందని క్యాడర్ కూడా నమ్మింది. చంద్రబాబు ఊరుకున్నప్పటికీ లోకేశ్ ఊరుకోరని, తమను వేధించేవారిని వరసగా జైలుకు పంపేందుకు నారా లోకేశ్ వెనుకాడరని క్యాడర్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.చంద్రబాబు నాయుడు ఒకింత ఆలోచన చేస్తారు. రాజకీయంగానే కాకుండా ఆయన ప్రతీకారం వంటి వాటికంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికే ఎక్కువ మొగ్గు చూపుతారు. చంద్రబాబు నాయుడును కూడా గత ప్రభుత్వం వదల్లేదని, అలాంటి వారిని కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని క్యాడర్ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఒకరకంగా చంద్రబాబుకు యాంటీగా పోస్టులు పెడుతున్నారు. అదే లోకేశ్ విషయానికి వచ్చే సరికి లోకేశ్ ఖచ్చితంగా తమకు న్యాయం చేస్తారంటూ నమ్ముతున్నారు. అందుకే క్యాడర్ లో రోజురోజుకూ లోకేశ్ కు ఇమేజ్ మరింత పెరుగుతుంది. చంద్రబాబుకు కూడా కావల్సింది అదే కావడంతో టీడీపీ క్యాడర్ లో మరింత ఉత్సాహం కనపడుతుంది.

## మంత్రి పదవికి ఇంకా టైముంది

**విజయవాడ :** నాగబాబుకు మంత్రి పదవి ఎప్పుడు? ఉగాదికి ఇస్తారా? లేకుంటే జూన్ లో పదవి ఇస్తారా? లేకుంటే మంత్రివర్గ విస్తరణ సమయంలో పదవి కేటాయిస్తారా? అన్న ఇప్పుడు చర్చకు దారితీసింది. నాగబాబును క్యాబినెట్ లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు కొద్ది నెలల కిందట ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే నాగబాబు ఏ సభలోనూ సభ్యుడు కారు. అందుకే ముందుగా ఎమ్మెల్సీ ని చేసి.. ఆపై మంత్రిని చేస్తారని ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఎమ్మెల్సీ కావడంతో మంత్రి పదవి ఎప్పుడు ఇస్తారో అన్నది ప్రశ్న.మరోవైపు బిజెపికి ఒక మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. ఇప్పటికే జనసేనకు మూడు మంత్రి పదవులు ఇచ్చారు. సంఖ్యాబలం బట్టి తమకు మరో మంత్రి పదవి ఇవ్వాలని బిజెపి పట్టుబడుతోంది. బిజెపికి ఒకే ఒక మంత్రి పదవి కేటాయించారు. కానీ ఆ పార్టీ నుంచి దాదాపు 8 మంది గెలిచారు. సుజనా చౌదరి తో పాటు విష్ణుకుమార్ రాజు మంత్రి పదవి ఆశిస్తున్నారు. క్యాబినెట్ లో ఉన్నది ఒకే ఒక్క మంత్రి పదవి. అందుకే ఆ పదవి జనసేనకు ఇవ్వాలా? బిజెపికి ఇవ్వాలా? అనే ఆలోచనలో ఉన్నారు చంద్రబాబు.అయితే నాగబాబు ఎమ్మెల్సీ అయ్యారు. ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలంటే తప్పకుండా మంత్రి పదవి ఇవ్వాలి. అయితే అది ఇప్పుడు ఇస్తారా? కొద్ది కొద్ది రోజులపాటు ఆగిన తర్వాత ఇస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం క్యాబినెట్లో ఉన్న మంత్రులు పదిమంది కొత్తగా గెలిచినవారే. రెండున్నర ఏళ్ల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అప్పట్లో సీనియర్లకు అవకాశం కల్పించి జూనియర్లకు పక్కన పెడతారని కూడా టాక్ నడుస్తోంది. అయితే అంతవరకు మంత్రి పదవి అందని ద్రాక్షగా ఉంటుందన్న ఒకసారి కొత్త టాక్.నాగబాబు ఇటీవల ఎమ్మెల్సీ అయ్యారు. ఆయన పదవీకాలం ఆరేళ్లు. అందుకే మంత్రివర్గ విస్తరణ వరకు ఆయనకు వెయిట్ చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. అప్పట్లో 25 మంది మంత్రుల్లో సగానికి పైగా ఉద్వాసన చెబుతారని. వారి బదులు సీనియర్లకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఈ లెక్కన నాగబాబు అప్పటివరకు ఆగాల్సిందేనని కూటమి వర్గాలు చెబుతున్నాయి. అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## లయోలాకు అటానమస్ రద్దు...

**విజయవాడ :** విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అటానమస్ హోదాను కృష్ణా యూనివర్శిటీ రద్దు చేసింది. కృష్ణా యూనివర్శిటీ నియమించిన కమిటీ విచారణలో పలు లోపాలను గుర్తించడంతో అటానమస్ హోదాను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. లయోలా కాలేజీలో అకడమిక్, ఎగ్జామినేషన్స్, ఫైనాన్షియల్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలపై కృష్ణా యూనివర్శిటీ కొద్ది నెలల క్రితం విచారణకు ఆదేశించింది. కమిటీ దర్యాప్తులో పలు ఉల్లంఘనలు గుర్తించారు. యూజీసీ నియమనిబంధనలు ఉల్లంఘించినట్టు తేలడంతో ఆంధ్రా లయోలా కాలేజీ స్వతంత్ర హోదాను రద్దు చేసి కృష్ణా యూనివర్సిటీ అనుబంధ కళాశాలగా పరిగణించనున్నట్టు పేర్కొన్నారు.ఆంధ్రా లయోలా కాలేజీకి సంబంధించిన అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, కోర్సులు, ఫీజుల వివరాలు, పరీక్షలకు సంబంధించిన డాక్యుమెంట్స్, సర్టిఫికెట్లను పది రోజుల్లో యూనివర్శిటీకి అప్పగించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిగిలిన అఫిలియేటెడ్ కాలేజీలతో పాటు విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు.విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అటానమస్ హోదా రద్దు చేయడానికి యూజీసీ నియమ నిబంధనల పాటించకపోవడం కారణంగా చెబుతున్నా అసలు కారణం మాత్రం కాలేజీ ప్రాంగణంలోకి వాకర్లను అనుమతించ పోవడంగా తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా లయోలా కాలేజీ ప్రాంగణంలోకి వాకర్లను అనుమతించాలంటూ స్థానికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇందుకు కాలేజీ యాజమాన్యం నిరాకరిస్తోంది.ఈ వివాదంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిలో రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు కూడా చేసింది. సమాజంలో ఉన్న ప్రభుత్వ కాలేజీల్లో కాకుండా ప్రైవేట్ కాలేజీ స్థలంలో వాకింగ్ కోసం పట్టుబడుతున్నారని లయోలా అభ్యంతరం తెలిపింది.నగరం మధ్యలో ఉన్న ఆంధ్రా లయోలా కాలేజీలో వాకింగ్ చేయడానికి అనుమతి కోసం వాకర్ సంఘాలు కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నాయి. సున్నితమైన ఈ వ్యవహారంలో ప్రభుత్వం నెల తరబడి ఉదాసీనంగా వ్యవహరించడంతో ఇది కాస్త రాజకీయ రగడగా మారింది. నగరం మధ్యలో ఉన్న ఈ కాలేజీ దాదాపు 100ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది.1950వ దశకంలో మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం అవతరించే సమయంలో లయోలా కాలేజీకి అంకురార్పణ జరిగింది. ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటైన ఈ విద్య సంస్థ ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.


# సంపాదకీయం

## ట్రంప్ శాంతి ప్రతిపాదనలు ఏకపక్షమేనా!

ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరి కా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొ నేందుకు రష్యా- చైనాల మధ్య కొంత దూరం సృష్టించాలని ఎత్తుగడగా కనిపిస్తున్నది. మూడున్నర దశాబ్దాలుగా 'ప్రచ్ఛన్న కాలం' నాటి సోవియట్ యూనియన్‌ను శత్రుదేశంగా పరిగణించే అమెరికా విదేశాంగ విధానంలో మార్పు తీసుకు వచ్చేందుకు ట్రంప్ ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిణామాలు సహజంగానే ఉక్రెయిన్‌కు అశనిపాతంగా మారే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్ష పదవిని రెండోసారి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ రెండు నెలల పదవీకాలంలోనే స్వదేశంలో, విదేశాలలో కలకలం సృష్టిస్తున్నారు. ఒకవంక, సంఘర్షణలను ఆపివేసి శాంతిదూతగా పేరు తెచ్చుకునేందుకు మధ్య ఆసియాలో తాను పదవి చేపట్టేలోగా కాల్పుల విరమణ జరగాలని స్పష్టం చేశారు. మరోవంక, ఉక్రెయిన్‌లో సైతం కాల్పుల విరమణకు ప్రతిపాదిస్తూ తాను తలచుకొంటే 24 గంటలలో సాధ్యం అవుతుందంటూ చెప్పుకొచ్చారు. సంఘర్షణలకు ఒకవైపు తాత్కాలిక విరామం లభించేటట్లు ప్రయత్నం చేస్తూ మరోవంక వాణిజ్యపరంగా టారిఫ్ యుద్ధాలకు ఆజ్యం పోస్తున్నారు. టారిఫ్‌లను తగ్గించని పక్షంలో ఎదుటివారెంతగా టారిఫ్‌లు విధిస్తారో తాము కూడా అంతే విధిస్తామంటూ చెబుతున్నారు. స్వదేశంలో సైతం ఉద్యోగులను తొలగించడం, పలు అసాధారణమైన ఉత్తర్వులపై సంతకాలు చేయడం చేస్తున్నారు. రెండు నెలలకే ఇంతగా హడావుడి చేస్తున్నారు, మరో నాలుగేళ్ల వరకు ఎంతగా చెలరేగిపోతారో అంటూ గుసగుసలు బయలుదేరుతున్నాయి. ఆయన చేపట్టిన చర్యలలో చాలావరకు సంచలనాలు కనిపించడమే గాని శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. ఆయనకు సైతం అటువంటి ఉద్దేశాలు ఉన్నట్టు లేదు. ఉదాహరణకు మధ్య ఆసియాలో కాల్పుల విరమణతో బందీల మార్పిడి వరకు విజయం సాధిస్తున్నారు. ఇది మొదటి దశ 45 రోజులకు మాత్రమే కావడం గమనార్హం. ఆ తర్వాత ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. రెండో దశలో గాజా నుండి ఇజ్రాయెల్ సేనలు పూర్తిగా వైదొలగాలి. అటువంటి అవకాశాలు కనిపించడం లేదు. ఇజ్రాయెల్ సైతం తమ బందీలను విడిపించుకోవడం కోసమే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు కనిపిస్తున్నది. మూడవ దశలో మొత్తం గాజాను పునర్నిర్మించి, అక్కడున్న పాలస్తీనా ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి, ట్రంప్ టవర్లు నిర్మిస్తారని వస్తున్న ప్రతిపాదనలు ఎవ్వరికీ ఆమోదయోగ్యం అయ్యే అవకాశం లేదు.సుస్థిరమైన పాలస్తీనా దేశం ఏర్పాటుకు ఇజ్రాయెల్ అంగీకరిస్తుందని భావించలేం. అదే విధంగా చివరకు ఇజ్రాయెల్ ప్రయోజనాలను కాపాడటం మినహా అమెరికా సైతం స్వతంత్రించి నిర్ణయాలు ప్రకటించలేదు. అక్కడున్న సుమారు 23 లక్షల మంది పాలస్తీనా ప్రజలను తరలించి పునరావాసం కల్పించేందుకు అరబ్ దేశాలు ఏవి ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులలో అది ఆచరణ యోగ్యమైన పరిష్కారం కూడా కాబోదు. దానితో సుడాన్, సోమాలియా వంటి తూర్పు ఆఫ్రికా దేశాలకు తరలించేందుకు చర్చలు జరుపుతున్నారు. హమాస్ పట్ల కఠినంగా మాట్లాడుతున్న ట్రంప్ వారిని తుదముట్టడించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. పాలస్తీనా ప్రజలను అక్కడి నుండి తరలించి, గాజా భూభాగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని, యుద్ధం కారణంగా కకావికలమైన ప్రాంతాన్ని బాగుచేసి, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయాలని అమెరికా ప్రతిపాదిస్తుంది. ఇదే మాత్రం కార్యరూపం దాలుస్తుందో చెప్పలేం.

ఇక ఉక్రెయిన్ విషయానికి వస్తే ఆ దేశాన్ని నట్టేట ముంచే, రష్యాతో చెలిమికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చెబుతున్న శాంతి పరిష్కారం ప్రతిపాదనలు అటు రష్యా, ఇటు అమెరికాలకు ప్రయోజనం కలిగించడమే గాని, ఉక్రెయిన్‌కు ఎటువంటి భరోసా కల్పించే అవకాశం కనిపించడం లేదు. ఈ యుద్ధం ప్రారంభమైనదే ఉక్రెయిన్‌ను నాటోలో సభ్యదేశంగా చేర్చుకునేందుకు అమెరికా, ఐరోపా దేశాలు ప్రయత్నించడంతో. రష్యా మొదటి నుండి పెడుతున్న ప్రధానమైన షరతు నాటోలో చేరబోమని హామీ ఇవ్వాలని. తమ దేశ సరిహద్దుల్లోకి నాటో దళాలను అనుమతించడం రష్యా భద్రతకు ప్రమాదకరం కాగలదు. యుద్ధం ప్రారంభమైన రెండు వారాల్లోనే అటువంటి షరతుకు ఉక్రెయిన్ సుముఖత వ్యక్తం చేస్తూ రాజీకోసం సిద్ధపడుతున్న సమయంలో అమెరికా, ఐరోపా దేశాలు చేరి పడనీయలేదు. ఉక్రెయిన్ భద్రతకు తాము భరోసా అంటూ రెచ్చగొట్టాయి. ఇప్పుడు రాజీకోసం ఉక్రెయిన్ కొంత భూభాగం పోగొట్టుకొనేందుకు సైతం సిద్ధపడాలని ట్రంప్ చెబుతున్నారు. ఉక్రెయిన్‌లోని నాలుగు రాష్ట్రాలు, అంటే 20 శాతం భూభాగం ఇప్పుడు రష్యా అధీనంలో ఉన్నాయి. ఎటువంటి శాంతి ప్రతిపాదనలు సైతం ఆ భూభాగాల నుండి రష్యాను వెనుకకు పంపించే అవకాశాలు కనిపించడం లేదు. మరోవంక, ఉక్రెయిన్‌కు తాము చేసిన సైనిక సహాయానికి బదులుగా ఆ దేశంలోని అత్యంత విలువైన, అరుదైన లోహాలపై తమకు ఆధిపత్యం కల్పించాలని అమెరికా ఒత్తిడి తెస్తున్నది. అమెరికా 500 బిలియన్ డాలర్ల సైనిక సహాయం చేశామని చెబుతున్నది. వాస్తవానికి ఆ మొత్తంలో నేరుగా కేవలం 160 బిలియన్ డాలర్లు మాత్రమే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయంగా ఇచ్చింది. మిగిలిన మొత్తాన్ని అమెరికాలోని ఆయుధ కంపెనీలకు అందజేసింది. ఆ విధంగా ఉక్రెయిన్ సహజ వనరులపై అమెరికా కన్నేసింది. మరోవంక, ఐరోపా దేశాల భద్రతకు తాను హామీ ఇవ్వలేనని ట్రంప్ చేతులెత్తేశారు. నాటో ఆర్టికల్ 5 ప్రకారం నాటోలోని ఏ సభ్య దేశంపై యుద్ధం జరిగినా అందులోని మొత్తం 32 సభ్య దేశాలు ఉమ్మడిగా సైనికంగా నిలబడాలి. కానీ ఇప్పుడు అమెరికా తోకాడించడంతో ఐరోపా దేశాలు ఆత్మరక్షణలో పడ్డాయి. దానితో అవి ఇప్పుడు ఉక్రెయిన్ కు సైనిక సహాయం అందించే పరిస్థితుల్లో లేవు. అందుకనే ఇప్పుడు ఫ్రాన్స్, జర్మనీ కలిసి 500 బిలియన్ డాలర్లతో ఉమ్మడి సైనిక వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించుకున్నాయి. అమెరికా ఇంకేమాత్రం తమకు సహాయకారి కాబోదని ఐరోపా గ్రహిస్తున్నది. ఈ పరిణామాలు అన్ని ఐరోపాలో మరింత అనిశ్చితకు అమెరికా ఆజ్యం పోస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ ప్రపాదిస్తున్న నెల రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను సూత్రప్రాయంగా ఆమోదిస్తూ, షరతులు ప్రకటిస్తున్న రష్యా కేవలం ఉక్రెయిన్ స్వాధీనంలోని కీలకమైన కురుస్క్ ప్రాంతాన్ని తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు కాలయాపన చేస్తున్నది. ఒక గ్యాస్ పైప్‌లైన్ లోపల కిలోమీటర్లు నడిచి లోపలకు ప్రవేశించి ఉక్రెయిన్ సేనలను రష్యా దళాలు ముట్టడించాయి. ఉక్రెయిన్ ఆగస్టులో కురుస్క్ లోపలకు చొచ్చుకుపోయేందుకు సాహసోపేతంగా సీమాంతర దాడి ప్రారంభించింది. రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా రష్యన్ భూభాగంపైకి అది అతిపెద్ద దాడిగా భావిస్తున్నారు. కొన్ని రోజుల్లోనే ఉక్రెయిన్ దళాలు వ్యూహాత్మక సరిహద్దు పట్టణం సుద్జాతో సహా వేయి చదరపు కి.మీ భూభాగాన్ని కైవసం చేసుకుని, వందలాది మంది రష్యన్లను యుద్ధ ఖైదీలుగా తీసుకున్నాయి. భవిష్యత్తులో శాంతి చర్చల్లో బేరసారాల్లో లబ్ధి పొందడం, తూర్పు ఉక్రెయిన్‌లో దాడులనుంచి రష్యన్ సైనికులను మళ్లించేలా ఒత్తిడి చేయడం లక్ష్యంగా ఆ దాడి నిర్వహించినట్లు కీవ్ వెల్లడించింది. అయితే, ఉక్రెయిన్‌పై ఆకస్మాత్తుగా దాడి జరపడం ద్వారా ఈ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడం ద్వారా రష్యా ఉక్రెయిన్‌కు దాదాపుగా కాల్పుల విరమణకు లొంగిపోవడం మినహా, ఎటువంటి బేరసారాలకు పాల్పడే అవకాశం లేకుండా చేస్తున్నది. కురుస్క్ ప్రాంతంలో ఉక్రేనియన్ సైనికులు 'తీవ్ర ఇబ్బందుల్లో' ఉన్నారని, రష్యన్ సైనికులు చుట్టుముట్టారని వెల్లడించిన ట్రంప్ తాను ప్రతిపాదిస్తున్న శాంతి ప్రతిపాదనలకు సంబంధించిన ఎటువంటి వివరాలు వెల్లడించడం లేదు. భూభాగాలు, విద్యుత్ ప్లాంటులు, కొన్ని ఆస్తుల విభజన గురించి ఉండవచ్చంటూ అస్పష్టంగా చెబుతున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు కీలకమైన ఐరోపాలోని అతిపెద్ద అణువిద్యుత్ ప్లాంట్ అయిన ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత జపోరిజ్జియాకు తిరిగి ఇచ్చే ప్రతిపాదనలు సైతం కన్పించడం లేదు. శాశ్వత శాంతి ప్రతిపాదనగా రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఇచ్చేసే ఎటువంటి ప్రతిపాదనకు రష్యా సుముఖంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ విషయంలో ట్రంప్ సైతం పట్టుదలతో ఉన్నట్లు లేదు. ఉక్రెయిన్‌కు సైనిక సహాయం నిలిపివేయడం, ఐరోపా దేశాలను సైతం ఉక్రెయిన్‌కు సైనిక సహాయం అందించలేని పరిస్థితులు కల్పించడం ద్వారా ఉక్రెయిన్‌ను నిస్సహాయ పరిస్థితుల్లో నెట్టివేసి ప్రయత్నాలే కనిపిస్తున్నాయి. ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరికా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు రష్యా- చైనాల మధ్య కొంత దూరం సృష్టించాలని ఎత్తుగడగా కనిపిస్తున్నది.

# పరీక్షలకే పరీక్ష



ఏడాది కాలంగా విద్యార్థి నేర్చుకున్న జ్ఞానానికి గంట, మూడు గంటల్లో పరీక్షించడం సబబా? ఇది నిజంగా విద్యార్థి ఏడాది కాలంగా నేర్చుకున్న అభ్యసనానుభవాలను అంచనా వేయగలుగుతుందా? విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వంను ఈ పరీక్షలు ఎంత వరకు కొలమానం? ఏళ్ళుగా వస్తున్న మన పరీక్షా విధానం పైన పలు రకాల సందేహాలు మన విద్యారంగం మేధావులు, నిపుణులు వ్యక్తం చేస్తూ వచ్చారు. బ్రిటీష్ వలసవాదం నుండి వచ్చిన ఈ పరీక్షా విధానం మెకాలేకి నకలని, అశాస్త్రీయమైనదని, సమూలంగా ఈ విధానం మారాలని, విద్యార్థులను ఒత్తిడికి గురిచేయని పరీక్ష విధానం కావాలని కోరుకున్నాం. అందులో భాగంగానే మన పరీక్షా విధానం లోని లోపభూయిష్టతను సరిదిద్ది పరీక్షా సంస్కరణలను తెచ్చుకున్నాం! విద్యాహక్కు చట్టం -2009 కొంతలో కొంతైనా మన అనుమానాలు నివృత్తి పరచగలిగింది. సరికొత్త పరీక్షా సంస్కరణకు అవకాశం కల్పించింది. విద్యాహక్కు చట్టం- 2009, సెక్షన్ 29 (1) హెచ్ ప్రకారం విద్యార్థి ఏడాది కాలంగా పొందిన అభ్యసనానుభవాలు, జ్ఞానసామర్థ్యాలు, ఒత్తిడి లేకుండా పరీక్షించే పరీక్ష విధానం నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) మన నూతన ప్రక్రియ! ఈ పరీక్షా విధానం మౌలిక మార్పులు ఏమంటే నేర్చుకున్న దంతా గంట, మూడు గంటల్లో జవాబులు రూపంలో కక్కేసే కంటే! విద్యార్థి అభ్యసన అనుభవాలతోపాటు, విద్యార్థి విద్యా సామర్థ్య అంచనా పరికరం పరీక్ష కూడా నిరంతర సమగ్ర ప్రక్రియగా ఉండాలి. అది ఏ పాఠశాలలో, ఏ విషయంలో నేర్చుకుంటున్నామో! ఆ ఉపాధ్యాయులు, ఆ అధ్యాపకులే ఎప్పటికప్పుడు నిరంతరం విద్యార్థిని అంచనా వేసుకుంటూ విద్యార్థికి పరీక్షనుండి గమనించిన అంశాలు నిరంతరం సమీక్షించి, సరిచేయడానికి సాధనంగా ఉండాలి. ఆసాధనమే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) విధానం అని విద్యాహక్కు చట్టం స్పష్టం చేసింది. దీని ప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఎ), ఇది నాలుగు దశలుగా సబ్జెక్టును విభజించి, ఆ సబ్జెక్ట్‌లో రాత సామర్థ్యం, పఠనసామర్థ్యం, ప్రాజెక్టు వర్క్ (పని అనుభవం), స్లిప్ టెస్టు (జ్ఞాన అనుభవం) వీటన్నింటినీ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో నిర్వహించబడి ఒక్కో అంశానికి 5 మార్కులు చొప్పున సగటున 20 మార్కుల ఏడాదిలో ఇవ్వబడతాయి.

ఈ నిర్మాణాత్మక పరీక్ష అనేది తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుల వ్యక్తిగత బోధన సరిదిద్దడానికి, ఉపాధ్యాయులు తమ బోధనానుభవాలు సమీక్షకు, విద్యార్థి తాను వెనకబడిన విషయం తనకు తాను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. ఒక విధంగా ఇవి మనం ఎంతోకాలంగా కోరుకున్న మార్పులే! ఇకపోతే సిసిఇలో రెండవ అంశం ఏమంటే సబ్జెక్టు రెండు భాగాలుగా విభజించి ఒక్కో సెమిస్టర్‌కు 40 మార్కుల చొప్పున రెండు సెమిస్టర్‌లు కలిపి 80 మార్కులకు విద్యనేర్చిన పాఠశాలలోనే సంగ్రాహనాత్మక మూల్యాంకనం జరుగుతుంది.

ఈ సంగ్రాహ నాత్మక మూల్యాంకనంలో విద్యార్థి పొందిన జ్ఞానంతో పాటు, ఆయా సబ్జక్టులలోని ఆరు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించబడతాయి. అంటే విద్యార్థి ఆ వయసులో పొందాల్సిన విద్యా సామర్థ్యాలు ఎంతో కొంత నిజాయితీగా అంచనా వేయగలిగిన విధానం. ఈ మొత్తం విద్యార్థి పొందిన 100 మార్కుల నుండి 3 నుండి 10 వరకు గ్రేడులను ఆయా విద్యార్థులకు పొందిన మార్కులను బట్టి ఇస్తారు. ఈ గ్రేడులే విద్యార్థి సమగ్ర మూల్యాంకనం అంచనాగా భావించి బోధనా లక్ష్యాలు విద్యార్థికి అందేలా ముఖ్యంగా సబ్జక్టు ఉపయోగపడే అంశంపైనే ఈ పరీక్షలు! విద్యార్థి, ఉపాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15 ఏళ్ళుగడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే ధైర్యం పాలక వర్గాలకు లేదు. ఇటు అర్థం చేసుకొని అనుసరించే స్థితికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులలో లోపించింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థ ఒత్తిడి తట్టుకోలేక, మానెటరింగ్ వ్యవస్థ సరిదిద్దుకోలేక, ఇప్పటికే సంగ్రహనాత్మక మూల్యాంకనం వార్షిక పరీక్షగా, పాత వాసనలతో నిర్వహిస్తున్న 80 మార్కులకు గాను, నిర్మాణాత్మక మూల్యాంకనం 20 మార్కులు కలిపి పాత పద్ధతిలో 100మార్కులకు ఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహించపూనుకుంది. ఇది ఈ ఏడే అమలు పరచాలని అధికారులు ప్రయత్నించారు కూడా? కానీ, కొన్ని సాంకేతిక సమస్యల వలన మరుసటి ఏడాదికి వాయిదా వేసుకున్నారు. అంతేకాకుండా మరో పరీక్ష మార్పుకు సైతం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సరైన గ్రేడ్ రాని పక్షంలో మే నెలలోపు మరో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించి ఒకేసారి ఫలితాలు ప్రకటిస్తామని ప్రకటించారు. అంటే పాత సప్లిమెంటరీ పరీక్షలు తిరిగి పునరుద్ధరణ అన్న మాట! అంటే ప్రైవేటు విద్యా వ్యవస్థ కోరికలు తూచా తప్పకుండా అమలు జరపడానికి అధికారులు, పాలకులు సంసిద్ధం అయ్యారనే విషయం సుస్పష్టం అవుతుంది. అభ్యసనానుభవాలు, పాఠ్యాంశాలు అధ్యయనంలో అంతర్లీనంగా, అంతర్భాగంగా జరగాల్సిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) ప్రక్రియ మన పరీక్ష విధానంలో ఒత్తిడి లేని సులభతరం అయిన విధానాలకు సూచికనై ఉండగా, దాన్ని బలోపేతం చేయకపోగా ఎటు తిరిగీ మన పాత మూల్యాంకనం విధానం వైపు మన విద్యాధికారుల ఆలోచనలు కొనసాగడంలో అంతర్యం ఏమిటో ఒకపట్టాన అర్థం కాదు? మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ ఒత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డిదారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏ రూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. మనం దీర్ఘకాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు ముందుకు పోవాల్సి ఉంది. ఒత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు లేని సంపూర్ణ పరీక్షా సంస్కరణ అమలు దిశగా అడుగులు వేద్దాం. మన పాఠశాల పరీక్షా వ్యవస్థలో సరైన మార్పులను మాత్రమే స్వాగతిద్దాం.

# ఆనందమే ఆరోగ్యం ఆరోగ్యమే మహాభాగ్యం


ఆనందం వెలకట్టలేని మానవ మానసిక సంపద. ఆనందంగా జీవించడం ఓ అద్భుత కళ. మన అస్థిత్వానికి పునాది సంతోషమే. ఆనందం అంగట్లో దొరికే అగ్గువ సరుకు కాదు. ముఖంలో నవ్వులు నర్తిస్తే అసలైన ఆనందంగా ఉన్నట్లు కాదు, నవ్వని వారు విషాదంలో మునిగినట్లు కాదు. మానసిక సంతోషానికి, ముఖంలో కనిపించే నవ్వులకు సంబంధం లేదు. మానస్ఫూర్తిగా సంతోషించే వారి ముఖాల్లో కోటి దివ్వెల వెలుగులు జనిస్తాయి. అంతరంగ ఆనంద ఊట బాయిలో ఉబికే ఊటయే సంతోషాల మూట. మన అనుమతి లేకుండా మన నుంచి ఎవ్వరూ ఆనందాన్ని దూరం చేయలేరు. ఆనందం అమూల్య ఆరోగ్యకర మానసిక ఆస్తి. ఆనందాల వేటలో కష్టసుఖాలను అనుభవిస్తూ సాగిపోతున్నాం, కొంత వరకు సఫలం అవుతున్నాం, అధిక శాతం వైఫల్యాలతో సంతోషాలకు దూరం అవుతున్నాం. ఆనందానికి సుఖానికి వ్యత్యాసం మరిచి పోతున్నాం. ఆనందానికి కొలమానం లేదు ఆనందాన్ని చూడడానికి, వర్ణించడానికి వీలు కాదు. సంతోషాన్ని అనుభవించడమే మనకు తెలుసు, వర్ణించడానికి వాక్యాలు దొరకవు. పడుకోగానే మనసారా నిద్రలోకి జారుకునే వారు అదృష్టవంతులు, అసలైన భాగ్యవంతులు. మన జీవనశైలి, ఆర్థిక స్థితిగతులు, ఆలోచనా విధానం, వ్యక్తిగత అలవాట్లు, విద్య వివేకాలు, సంతృప్త ఆధ్యాత్మిక భావనలు, మానవీయ దృక్కోణం, సర్దుకుపోయే గుణం, ఆశావహ దృక్పథం, కుటుంబ నేపథ్యం, సహచర బంధుమిత్రులు, కార్యాలయ లేదా పని ప్రదేశ్ ప్రభావాలు, సామాజిక స్థితిగతులు, సాంస్కృతిక ఆచార వ్యవహారాలు, మానవ సంబంధాలు, భావోద్వేగ నియంత్రణలు, చిన్న చిన్న విషయాల్లో గొప్ప గొప్ప సంతోషాలను వెతుక్కోవడం, ఆహార అలవాట్లు, ఆశ-దురాశలు, ఈర్ష్య అసూయ లాంటి అనేక అంశాలు మన ఆనంద క్షణాలను ప్రభావితం చేస్తాయి. ఒక చిన్న సమస్య మన ఆనందాన్ని లాక్కోవచ్చు. ఒక చిన్న సమస్యను తలుస్తూ వందల సార్లు వగచి, తలచి కుమిలిపోయే వారికి ఆనందం అందని ద్రాక్ష అవుతుంది. మనం చేసే ప్రతి పనికి అంతిమ లక్ష్యం ఆనందం వెతుక్కోవడమే. మానవ ఆరాటపోరాటాల గమ్య స్థానం ఆనంద నిధిని పొందడం




మాత్రమే. ఆనందానికి, శ్రేయస్సుకు విడదీయరాని బంధం ఉంటుంది. నేటి వేగవంతమైన ఆధునిక డిజిటల్ ఏఐ యుగపు మానవుడికి ఆనందం అందని వస్తువే అవుతున్నది. ఆనందమయ జీవితం గడిపే వారికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఆనందమే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమని తెలుసుకుందాం. సిరి సంపదలు, కీర్తి, పరువు ప్రతిష్టలు ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. డబ్బుతో విలాసవంతంగా బతకవచ్చు, కాని ఆనందంగా జీవిస్తామనే గ్యారంటీ లేదు. సంపద పెరిగితే సమస్యలు కూడా పెరుగుతూ మన ఆనంద క్షణాలు హరించుకుపోతాయి. శారీరక సౌకర్యమే సుఖం, మానసిక ఉత్తమ స్థితి సంతోషం అని తెలుసుకోవాలి. ఆనందంగా జీవించడం అనే అద్భుత కళను ప్రచారం చేయడానికి 2012లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రపంచ దేశాలు ప్రతి ఏట 20 మార్చిన "అంతర్జాతీయ ఆనంద దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ హాపీనెస్"ను 2013 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ ఆనంద దినోత్సవం ఇతివృత్తం "షేరింగ్ అండ్ కేరింగ్" అని తెలుసుకొని, దానిని మన జీవన మంత్రంగా చేసుకొని సంతోషంగా జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. మనం ఇష్టపడే పనిలో సంతోషం దాగి ఉంటుంది. మన పనిని ఇష్టపడడం వల్ల ఆనంద నిధికి చేరువవుతాం. సంతోషంగా జీవించగలగడం ఓ అదృష్టం. బతుకడానికి, జీవించడానికి వ్యత్యాసం ఆనందమే. ఆనందంగా లేని వారు బతుకుతారు, సంతోషంగా జీవనయానం చేసే వారు జీవిస్తారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి అంశం నుంచి మనం ఆనందాన్ని వెతుక్కోవడం నేర్చుకోవాలి. ఆనందం ఎవరు ఇచ్చే వస్తువు కాదని, మనం ఆస్వాదించే జీవన విధానమే మనకు సంతోషాలను ఇస్తుంది. ఆనందంగా ఉండడం, సంతోషాలను పంచడం మన జీవిత లక్ష్యం కావాలి. మరొకరి సంతోషానికి మనం కారణం అయినపుడు మనకు అద్భుత ఆనంద నిధి దొరుకుతుంది. "బి హ్యాపీ - మేక్ అదర్స్ హ్యాపీ" అనే సూత్రాన్ని అమలు చేస్తే మన వెంట ఆనంద సుగంధాలు వస్తాయి.

# ప్రేక్షకుల ప్రశంసలందుకున్న"అనూహ్యం " నాటిక.






**పాలకొల్లు మార్చి 19. ప్రజా జ్యోతి. (కొట్టి రామం )** పాలకొల్లు కళాపరిషత్ పాలకొల్లులో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల సందర్భంగా ప్రత్యేక ప్రదర్శనగా నటీ నట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారు ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆద్యంతము ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానిక నాటక రచయిత, నటుడు అయిన తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన ఈ నాటికకు కత్తుల రామ్మోహన్ రావు దర్శకత్వం వహించారు. స్వయం కృషితో అభివృద్ధి చెందవలసిన కన్నబిడ్డలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ సోమరితనంతో తండ్రి వారసత్వ ఆస్తులను చేజిక్కించుకోవడానికి వ్యూహాలు పన్ని తల్లిదండ్రులను మోసగిస్తుంటారు. తల్లిదండ్రుల వారసత్వ సంపదని హక్కుల పేరుతో తల్లిదండ్రులు ఉండగానే దక్కించుకొని అనుభవించాలని చూస్తారు. ఇటువంటి కన్న కొడుకులు ఉన్న తల్లిదండ్రులు జీవిత చరమాకంలో మనోధర్యంతో ప్రశాంతంగా జీవించడానికి అనూహ్యమైన వ్యూహాలతో తల్లిదండ్రులు ముందుకు సాగాలని, వారసత్వ సంపదను అనుభవించడానికై బిచ్చగాళ్ళలా ఎదురు చూడకుండా స్వయంగా సంపాదించుకుంటూ ఆత్మాభిమానంతో కొడుకులు జీవించాలన్న ఇతివృత్తంతో అనూహ్యం నాటికను రచయిత తాళాబత్తుల రూపొందించారు. ఈ నాటికలో తల్లిదండ్రులు ఆనందరామయ్య వసుంధరలు కాగా ఆనంద రామయ్య వారతత్వ సంపదను దక్కించుకోవడానికి కొడుకులైన మనోహర్, రాజేష్లు మోసగాడైన ధనుష్ కోటి తో కలిసి అతని మాయ మాటలకు లోబడి తండ్రి దగ్గర వ్యాపారం పేరుతో లక్షలు తీసుకుని కోటి చేతులో పెడతారు. అంతటితో ఆగకుండా తండ్రి ఆస్తిలో తమ వాటా తమకు ఇచ్చేయాలని వత్తిడి చేస్తారు. తండ్రి ఆనందరామయ్య వారి కుతంత్రాలను పసిగట్టి తిప్పి కొడతాడు. అనునిత్యం మోసం చేస్తున్న కన్న కొడుకులకు తగిన గుణపాఠం చెపుతాడు. ఇటువంటి కొడుకుల మోసపూరిత చర్యలకు తల్లిదండ్రుల జీవితం పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడీలా ముగిసిపోకూడదని తనను తాను రక్షించుకుంటారు. తల్లిదండ్రులకు కొడుకులకు చక్కటి సందేశాన్ని ఇచ్చే ఈ నాటికలో తండ్రి ఆనందరామయ్యగా ఎంవి రాజేష్ తల్లి వసుందరగా యస్ జ్యోతిరాణి పెద్ద కొడుకు మనోహర్ గా మాదిరెడ్డి శ్రీనివాస్ చిన్న కొడుకు రాజేష్ గా బి శ్యామ్ శేఖర్ మనోహర్ భార్య రంజితగా ఎస్ మాధవి ఆనంద రామయ్య స్నేహితుడు సాంబముర్తిగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు ఫైనాన్స్ ఏజెన్సీ డైరెక్టర్ ధనుష్ కోటిగా గుడాల హరిబాబు నటించి తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. "వాడు సంపాదించుకోకుండా పరాన్నజీవిగా మారిపోయాడు వసుంధరా " "బిడ్డలు భయపెట్టారనో బలవంత పెట్టారనో అడిగిందల్లా ఇచ్చేస్తే మనకు కన్నీళ్లే మిగులుతాయి" వంటి పదునైన సంభాషణలు ప్రేక్షకుల మనసులను ఆలోచింపచేస్తాయి. ఈనాటికకు వై సాయి తేజ సంగీతం అందించగా గొన్నాబత్తుల రవికుమార్ రంగాలంకరణ చేశారు. ఆహార్యం పి శ్రీధర్ సమకూర్చారు. ప్రదర్శన అనంతరం నాటిక రచయిత తాళబత్తుల వెంకటేశ్వర రావు దర్శకులు కత్తుల రామ్మోహన్ రావు ప్రజాజ్యోతి తో ముచ్చటించారు. అనూహ్యం నాటికను 2024 సంవత్సరం ప్రారంభం నుండి పలు కళాపరిషత్ లు నిర్వహించిన నాటిక పోటీలలో ప్రదర్శించడం జరిగిందన్నారు.గత ఏడాది నుండి ఇప్పటివరకూ తొమ్మిది కళా పరిషత్ ల నుండి ఉత్తమ ద్వితీయ, తృతీయ ప్రదర్శన, జ్యూరీ ప్రదర్శనతో పాటు ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ హాస్య నటుడు, ఉత్తమ జ్యూరీ నటుడు, ఉత్తమ క్యారెక్టర్ విబాగాలలో అవార్డులను దక్కించుకున్నామన్నారు. గత ఏడాది నుండి ఈ ఏడాది జనవరి వరకు తొమ్మిది కళాపరిషత్తుల నుండి 27 అవార్డులు అందుకోవడం జరిగిందని వారు తెలిపారు. వారసత్వ ఆస్తుల కొరకు తల్లిదండ్రులను వేధించే కొడుకులను ఆలోచింపజేసి కనువిప్పు కలిగిస్తుందన్న ఆశయం తో తమ నాటిక ప్రదర్శన కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. తమ నాటిక ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్న పలు కళాపరిషత్ ల ప్రోత్సాహం మరువలేనిదని వారు పేర్కొన్నారు. పాలకొల్లు కళావేదికపై తమకు ప్రత్యేక ప్రదర్శనకు అవకాశం ఇచ్చిన పాలకొల్లు కళాపరిషత్ సభ్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

# వైభవంగా భూతప్పల ఉత్సవం
# వేలాది సంఖ్యలో పోటెత్తిన భక్తులు





**రొళ్ళ,మార్చ్19,ప్రజాజ్యోతి:** రొళ్ళ మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భూతప్పల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రమే వేల సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు.బుధవారం ఉదయం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల కానుకలు మేరకు అభిషేకాలు అర్చనలు జరిపారు.అనంతరం భూతప్పలు ఈరముద్దమ్మదేవి ఆలయం వద్ద నుంచి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆవరణ వరకు రోడ్డుపై కిలో మీటర్ల మేర భూతప్పల రాక కోసం భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధాలతో భక్తులు బోర్లా పడుకున్నారు.తొలుత మారుతీ కాలనీ సమీపంలోని ముత్తరాయస్వామి దేవాలయంలో భూతప్పలు ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో పాదాల బండ వద్ద నుంచి నృత్య చేస్తూ ఆలయం వద్దకు చేరారు.అనంతరం తడి బట్టలతో బోర్లాపడుకున్న భక్తులపై భూతప్పలు నాట్య మాడుతూ.. కాలు మోపుతూ ముందుకు సాగారు.భూతప్పల కాలి స్పర్శతో దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని, సంతానం భాగ్యం లేని మహిళలకు సంతానంకలుగుతుందని, పెళ్లి కాని యువతులకు పెళ్లిళ్లు జరుగుతాయని భక్తుల విశ్వాసం. మేళతాళాలతో భూతప్పలు ప్రధాన ఆలయ ప్రాంగణం చేరుకుని చుట్టు ప్రదక్షిణలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేయించుకుని సమీపాన ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకుని పూజలు అందుకున్నారు. తదుపరి ఆంజనేయస్వామి ఆలయం ఆవరణం ముందు భాగాన భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు సమర్పించిన బొరుగులు రాసి చుట్టూ ఉరాలు కొడుతుండగా భూతప్పలు నాట్య మాడారు.తదుపరి భక్తులు రాశిగా పోసి ఉంచిన బొరుగులను భూతప్పలు బుజించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొక్కులు ఉన్న భక్తాదులు అన్నదానం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ట్రైనీ డి.ఎస్.పి ఆదేశాలు మేరకు మడకశిర రూరల్ సీఐ రాజ్ కుమార్, స్థానిక ఎస్ఐ వీరాంజనేయులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన తమ్మినేని





**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ :** ఆమదాలవలస మండలంలో పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన , అనారోగ్యం తో బాధపడుతున్న పలువురి కుటుంబాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారం పరామర్శించారు. మండలం నిమ్మ తొర్లాడ గ్రామ సర్పంచ్ సోమరాజు తేజ అనారోగ్యం బారిన పడ్డారు. ఈ మేరకు బుధవారం నాడు ఆయన నివాసంలో తమ్మినేని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నిమ్మ తొర్లాడ గ్రామంలో ఇప్పిలి ఆదిలక్ష్మి , సేపెన పేట గ్రామంలో సేపెనా సింహాచలం ఇటీవల పరమపదించారు.ఆయా కుటుంబాలను పరామర్శించి , మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని తో పాటు వైయస్సార్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు ,వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, కొత్తవలస వైస్ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, ఎంపీటీసీ కుటికుప్పల సన్యాసిరావు, నాయకులు బొడ్డేపల్లి మన్మదరావు ,ఇప్పిలి శ్రీను, సెపెన కృష్ణ ,కన్నబాబు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పరామర్శించారు.


## డొక్కా సీతమ్మ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం.



**రోళ్ల,మార్చి19,ప్రజాజ్యోతి:** రోళ్ళ మండలం నరసింహ స్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం భూతప్ప మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం తూమకుర్ శ్రీదేవీ హాస్పిటల్ టాప్ నర్స్ డిఎన్ నళిని సహకారంతో మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ తరపున భక్తులకు డొక్క సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్యాయకర్త టీ రంగస్వామి,మండల ఉపాధ్యక్షుడు కళ్యాణ్ కుమార్,మండల ఉపాధ్యక్షుడు రత్నగిరి గోపి మడకశిర పట్టణ ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి అంగన్వాడీలకు
## పోషణ భి పడాయి భి ట్రైనింగ్

ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సి.డి.పి. ఓ ఎస్ అనురాధ



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** నేటి నుండి అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ భి పడాయి భి శిక్షణా తరగతులను లోలుగు ఉపహార్ ఎన్.జి. ఓ నందు నిర్వహించడం జరుగుతుందని ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సి.డి.పి. ఓ ఎస్ అనురాధ తెలిపారు. ఈ నెల 20,21,23 తేదీల్లో ఐ.సి.డి.ఎస్ సేవలు , పోషకాహారం , నవచేతన వంటి నూతన విద్యా విధానాలపై కార్యకర్తలందరికీ శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. తీవ్రమైన , మధ్యస్థ ,సూక్ష్మ పోషకాహార లోపం పై శిక్షణ ఇచ్చి పిల్లలో పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో నవ చేతన జననం నుండి మూడు సంవత్సరాల వరకు పిల్లల కోసం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ స్టిమ్యులేషన్ ,మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల కోసం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల పట్ల పోలీస్ శాఖ ప్రజల్లో
## అవగాహన తీసుకురావాలి........




**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** పామిడి పట్టణం చుట్టుపక్కల పల్లె గ్రామాల నుండి ఇతర గ్రామాలకు కూలీ పని కోసం కూలీలను తరలిస్తున్నటువంటి ఆటో మరియు బొలెరోలో పరిమితికి మించిన దానికంటే ఎక్కువ మొత్తంలో కూలీలను తరలిస్తున్నారు. ఇది ఎక్కడో కాదు ప్రతిరోజు ఉదయాన్నే పామిడి నేషనల్ హైవే మీదుగా ఎద్దులపల్లి సర్కిల్ నుండి ఇతర గ్రామాలకు ఒక్క వాహనంలో దాదాపుగా 50- 60 మంది కూలీలను తరలిస్తూ తిరిగి సాయంకాలం యధావిధిగా ఇదే మార్గంలో ఇళ్లకు తరలిస్తున్నారు పామిడి పట్టణంలో ఆహా..... ఓహో.... అనేలా ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేసి సరిఅగు డాక్యుమెంట్స్ లేకపోతే చలానాలు వేసి తగు చర్యలు తీసుకుంటున్నారు కానీ ఇలాంటి వాటిపై దృష్టి పెట్టలేక పోతున్నారా అని పామిడి పట్టణ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు ఈ మధ్యకాలంలో కల్లూరు గ్రామ సమీపాన కూలీలను తరలిస్తున్నటువంటి ఒక బొలెరో బోల్తా పడిన దుర్ఘటన మనందరికీ తెలిసినదే ఇప్పటికైనా ఇలాంటి వాటిపై తగు చర్యలు తీసుకుంటారని పామిడి పట్టణ ప్రజల కోరడమైనది 300 రూపాయల కూలీ కోసం ఆశపడి వెళుతున్నటువంటి కూలీల ప్రాణాల పట్ల అటు డ్రైవర్లు కానీ కూలీల మేస్త్రీలు గాని కూలీల ప్రాణాల పట్ల వ్యవహరిస్తున్నటువంటి నిర్లక్ష్యత ఎంతవరకు సమంజసం ఒక కుటుంబాన్ని పోషిస్తున్నటువంటి వారికి ఇలాంటి నిర్లక్ష్యత వల్ల ఏదేని జరగకూడనిది జరిగితే ఆ కుటుంబానికి దిక్కెవరు కూలీల ప్రాణాలను అడ్డుపెట్టుకొని మేస్త్రీలు సొమ్ము చేసుకుంటున్నారు వీటి పట్ల అధికారులు తగు చర్యలు తీసుకుంటారని పామిడి పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు

## వైయస్ జగన్ ను మర్యాదపూర్వకముగా
## కలిసిన చుక్కలూరు దిలీప్ రెడ్డి



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి యువ నాయకుడు చుక్కలూరు దిలీప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దిలీప్ రెడ్డిని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అనంతరం అనంతపురం జిల్లాలోని పార్టీ పరిస్థితులపై పార్టీ అధ్యక్షుడికి వివరించారు. పార్టీ కార్యకర్తలకు, యువతకు అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిలీప్ రెడ్డికి జగన్ సూచించారు.

# రైల్వే బ్రిడ్జి లేక వాహనదారుల ఇక్కట్లు














మండుటెండల్లో ప్రయాణికుల అవస్థలు
గంటల తరబడి నిరీక్షణ
అత్యవసర సమయాల్లో రైల్వే గేటు పడి ఇబ్బందుల్లో స్థానికులు
బ్రిడ్జి నిర్మాణానికి లేని ప్రతిపాదనలు
తక్షణమే రైల్వేగేటు వద్ద పై ఓవర్ నిర్మాణం చేపట్టాలి
తుంగపేట సర్పంచ్ పప్పల వేణు గోపాలం ,పి. ఎ.సి.ఎస్ సి.ఈ. ఓ వై పాపినాయుడు ,ఉపాధ్యాయులు కాళ్ళకూరి మధుబాబు,స్థానికుల డిమాండ్

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల రైల్వే గేటు స్థానంలో పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం లేకపోయావడంతో ప్రయాణికులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఆ మార్గంలో రైల్వే గేటు వల్ల రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అరగంట కొకసారి రైల్వే గేటు వేయడంతో అత్యవసర సమయాల్లో గంటల తరబడి స్థానికులు నిరీక్షిస్తున్నారు. ఈ మేరకు లైదాం, సిరిపురం, అప్పలగ్రహారం, సంతకవిటి, తుంగపేట, గోరింట, తాడివలస,లత్సయ్యపేట, గోకర్ణపల్లి, కావలి, వాల్తేరు, పనసపేట వంటి సుమారు 70 గ్రామాల నుంచి పొందూరు రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించే ప్రజలకు పొందూరు రైల్వే గేటు పెద్ద ఆటంకంగా మారిందని తుంగపేట సర్పంచ్ పప్పల వేణు గోపాలం ,పి. ఎ.సి.ఎస్ సి.ఈ. ఓ వై పాపినాయుడు ,ఉపాధ్యాయులు కాళ్ళకూరి మధుబాబు ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిరంతరం వేల సంఖ్యలో ఈ గేటు దాటి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నారని తెలిపారు. ఎప్పుడు గేటు పడుతుందో, పడితే ఎప్పుడు తీస్తారో తెలియని పరిస్థితుల్లో సమయానికి చేరుకోలేక నిరంతరం నరక యాతన పడుతున్నామన్నారు. దాదాపు అన్ని మాన్యువల్ రైల్వే గేట్లు స్థానంలో అండర్ పాసేజ్ లు నిర్మాణం చేపట్టారు కానీ పొందూరు రైల్వే గేటు సమస్య అటు అండర్ పాసేజ్ నిర్మాణం చేపట్టక, ఇటు పై వంతెన నిర్మాణానికి నోచుకోక ఉండిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. అత్యవసర ఆరోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు రైల్వే గేటు వేయడం వల్ల ఎక్కువ సమయం వేచి ఉండటంతో ఆ ప్రాంతాల ప్రజలు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని వివరించారు.వర్షాకాలంలో గేటు పడితే తడుస్తూ, ఎండాకాలంలో సరైన నీడ లేక వేడిమికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.గత ప్రభుత్వం కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక కానీ ఎటువంటి ప్రతిపాదన ముందుకు రావడం లేదన్నారు.ప్రాంత ప్రజలు, నాయకులు అందరూ పార్టీలకతీతంగా ఉద్యమించి పొందూరు రైల్వే గేటు స్థానంలో పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమస్యను స్థానిక శాసన సభ్యులు కూన రవికుమార్ దృష్టికి, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తక్షణమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే రైళ్ల రాకపోకలను నిలుపుదల చేసి పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డాక్టర్ వి.జయరాజ్.



**పాతపట్నం మార్చి 19, ప్రజా జ్యోతి న్యూస్.** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు అందరూ వినియోగించుకోవాలని శాఖ టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ విజయరాజ్ పిలుపునిచ్చారు. మండలంలో బి గోపాలపురం గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు ఎంతో ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్న ఈ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు .గాలికుంటు వ్యాధి సోకిన పశువు పాలకు, మరియు పాల ఉత్పత్తులకు విదేశాల్లో గిరాకీ ఉండదని తద్వారా జాతీయ మరియు రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై ఇది ప్రభావం చూపుతోందని చెప్పారు .డివిజన్లో 2,10,800 టీకాలు లక్ష్యమని, ఇప్పటివరకు ఒక1,06,108 టీకాలు వేసినట్లు చెప్పారు. ప్రతి మండలంలో పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఈ టీకాలు కార్యక్రమాన్ని ఈనెల 30 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు మాసాలు దాటిన దూ డలకు మొదట వ్యాక్సిన్ వేసి, ఒక నెల తర్వాత బూస్టర్ డోస్ మళ్ళీ వే యను న్నట్లు చెప్పారు. నాలుగు మాసాలు దాటిన ఆడ దూడ లకు బ్రూసెల్ల టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఢిల్లేశ్వరరావు, పెదలోగిడి పశు వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, సిబ్బంది నిరంజన్ ,మోహన్, ఉత్తమరావు పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ అధినేతతో కిల్లి వెంకట సత్యన్నారాయణ





మర్యాదపూర్వకంగా కలిసి ముచ్చటించిన సత్తియ్య
నియోజకవర్గ పరిస్థితులపై చర్చ
సమస్యలను , పార్టీ స్థితిగతులను తెలుసుకున్న మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి

**శ్రీకాకుళం (ఆమదాలవలస) ప్రజా జ్యోతి న్యూస్:** ఆమదాలవలస నియోజకవర్గం లో రాజకీయ పరిస్థితులు రోజురోజుకీ ఉత్కంఠ భరితంగా మారుతున్నాయి. వైకాపా అధినేత ,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యన్నారాయణ వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నాడు మర్యాద పూర్వకంగా కలిశారు. దీంతో నియోజకవర్గంలో ఈ అంశం చర్చనీయాంశం గా మారింది. జగన్మోహన్ రెడ్డి ఛాంబర్ వద్ద ఆయన పది నిమిషాల పాటు వైకాపా పార్టీ అధినేతతో చర్చించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ పార్టీ స్థితిగతులను , సమస్యలను జగన్మోహన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు ప్రజల్లో వైఎస్సార్సీపీ పార్టీ పట్ల ఉన్న అభిప్రాయాలను , ప్రజా సమస్యల పట్ల పార్టీ నేతలు చేస్తున్న కార్యక్రమాలు , కృషి గురించి ఆరా తీశారు. నియోజకవర్గ పరిస్థితులపై పది రోజుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టిన అనంతరం పార్టీ అధిష్టానం కబురు పెడుతుందని, మరల రావల్సి వస్తుందని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నట్టు ఈ సందర్భంగా కిల్లి సత్తియ్య తెలియజేశారు.

## టిడిపి నాయకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం.



**రోళ్ళ,మార్చి19,ప్రజాజ్యోతి:** రోళ్ళ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా బుధవారం భూతప్పల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండు మలతిప్పేస్వామి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఆదేశాల మేరకు మండల కన్వీనర్ దాసిరెడ్డి, రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప ఆధ్వర్యంలో 10 కింటాళ్ల బియ్యంతో వంటకాలు చేసి 5వేలకు పైగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జికె ఈరన్న, అర్బన్ కోఆర్డినేటర్ రామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజ్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు ఆనంద్, భరత్ తదితరులు పాల్గొని అన్నదానం చేశారు.

## శ్రీఅల్లూరి సీతారామరాజు సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేత.



**పోడూరు, మార్చి 19,ప్రజాజ్యోతి న్యూస్.** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ వారి ఆధ్వర్యంలో శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి వారి దాతృత్వంతో పోడూరు మండలం కొమ్ము చిక్కాల గ్రామానికి చెందిన వై సుబ్బలక్ష్మి క్యాన్సర్ వ్యాధితోబాధపడుతుండగా వారికి రూ. 5000, నరసాపురం మండలం దర్బరేవు గ్రామానికి చెందిన వి. సత్యనారాయణ రాజు గుండె మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న కారణం చేత వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000, నార్నిమెరక గ్రామానికి చెందిన బిసూర్యనారాయణ రాజు మానసిక వ్యాధితో బాధపడుతున్న కారణంగా ఆయనకు చికిత్స నిమిత్తం రూ. 5000 , మట్లపాలెం గ్రామానికి చెందిన పి. రామకృష్ణ రాజుకి ఏ ఆధారం లేకుండా వృద్ధాప్యంతో బాధపడుతున్న కారణంగా ఆయనకు రూ.5000 బుధవారం ఆర్దికసాయంఅందజేసినారు. ఆర్థిక సాయం అందుకున్న బాధితులు వారి కుటుంబ సభ్యులు పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ కు, అల్లూరి సీతారామరాజు సేవాసమితికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు , కార్యదర్శి డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ , గౌరవ అధ్యక్షులు కనుమూరి రామకృష్ణంరాజు , మాజీ కార్యదర్శి పీవీఎస్ సూర్యనారాయణ రాజు , వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, వేగేశ్న బదరీ నారాయణ రాజు , పేరిచర్ల సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

## ధర్మవరం గ్రామంలో మురళిరాజు పర్యటన



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం చెందిన బొల్లు వెంకటరమణ,అప్పన్న గారి తండ్రి రాజారావు గారు స్వర్గస్తులయ్యారు వారి కుటుంబం సభ్యులు పరామర్శించిన. ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ %ca% ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సిపి నాయకులు శ్రీ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,పోకనాటి శేషయ్య ,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,బొల్లు రాజుబాబు ,దోమలంక బాబ్జి ,తిమ్మిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు

## మిత్ర ధర్మం పాటిద్దాం సమన్వయం తో పనులు సాధిద్దాం కలమట తో సిరిపురం.





**పాతపట్నం మార్చి19, ప్రజా జ్యోతి న్యూస్..** కొత్తూరు మండలం మాతల గ్రామంలో ఈ రోజు బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.బీజేపీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఈ భేటీలో కూటమి ప్రభుత్వంలో మిత్ర ధర్మం గా అన్ని పనులు కలుపుకుని ముందుకు సాగాలని, సమన్వయ కమిటీల కోసం, జిల్లాలో వుండే సమస్యల పైన చర్చించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు తాడేల భూపతి,కొత్తూరు మండల అధ్యక్షులు బురద భాస్కరరావు, పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు,బడియాల బాబురావు, జాన్ కటారి గారు,సుంకు ప్రసాద్, అప్పలరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఎమ్మెల్యే ఎమ్మెల్సీ స్టిక్కర్లు అంటిస్తే చర్యలు..

ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరిక..
పోలీస్ సైరన్ వినియోగించడం నేరం..
సీఎంఓ స్టిక్కర్ వేసుకుని పోలీస్ హారన్ వినియోగిస్తున్న వ్యక్తి అరెస్ట్.. వాహనం సీజ్..
మోసగాళ్ల వలలో పడవద్దు..
అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి..



**ఏలూరు, మార్చి 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఎవరైనా అనుమతులు లేకుండా వాహనాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్టిక్కర్లు అంటించడం గాని,పోలీస్ సైరన్ వినియోగించటం చేసినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరించారు. ప్రజలు అటువంటి మోసగాళ్ల బారిన పడవద్దని అటువంటి వారిపై అనుమానం వచ్చిన వెంటనే దగ్గర్లోని పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని ఎస్పి సూచించారు. ఇది ఎలా ఉండగా కామవరపుకోట కు చెందిన జగన్నాథ రావు అనే జగన్ తన వాహనానికి సీఎంఓ స్టిక్కరింగ్ చేసుకుని పోలీస్ సైరన్ ఏర్పాటు చేసుకున్న ఘటన సంబంధించి కేసు నమోదు చేసి అతని ఆగస్టు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎస్ డి పి ఓ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం సీఐ వి. కృష్ణబాబు పర్యవేక్షణలో తడికలపూడి ఎస్సై పి. చెన్నారావు గారి నేతృత్వంలోఅరెస్టు చేశారు. వివరాల్లో పెడితే జగన్నాథ రావు అనే జగన్ తపస్య గ్లోబల్ స్కూల్, కాలేజీ అనుమతులు లేకుండా ప్రారంభించి విద్యార్థులను చేర్చుకున్నారు. అయితే ఆ కాలేజీకి అనుమతులు లేకపోవడం నేపథ్యంలో విద్యార్థులను కామవరపుకోటలోని విశ్వతేజ స్కూల్లో జాయిన్ చేసుకోమని అడుగగా దానికి విశ్వతేజ స్కూల్ యాజమాన్యం అంగీకరించకపోవడంతో నిందితుడు తాను సీఎంఓ (చీఫ్ మినిస్టర్ ఆఫీస్) ఏ పి సి ఆర్ డి ఏ లో వైస్ చైర్మన్ గా పని చేస్తున్నానని చెప్పి, బ్లాక్‌మెయిల్ చేసి, 5 లక్షలు డిమాండ్ చేసి, ఇవ్వకపోతే స్కూల్ అనుమతులు రద్దు చేయిస్తానని బెదిరించినట్లు కేసు నమోదు అయింది. ఈ వ్యక్తి తన కారుకి సీఎంఓ అని పెట్టుకుని, పోలీసు సైరన్ కూడా అమర్చి, అనధికారికంగా వినియోగిస్తున్న నేపథ్యంలో తడికలపూడి పోలీసులు కారును సీజ్ చేశారు. నిందితుడికి గతంలో నేర చరిత్ర ఉందని పోలీసులు తెలిపారు.

# మహిళల భద్రతే ధ్యేయంగా శక్తి బృందాలు..





జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్..
ప్రతి సబ్ డివిజన్ కు ఒక శక్తి బృందం..
జిల్లా హెడ్ క్వార్టర్ లో రెండు బృందాలు..
ఒక్కో బృందంలో ఎస్ఐ నేతృత్వంలో ఆరుగురు సభ్యులు..
మహిళల్ని వేధించే వారి భరతం పట్టేందుకు శక్తి టీమ్స్..
"శక్తి యాప్" ప్రతి మహిళకు రక్షణక కవచం..

**రాజమహేంద్రవరం, మార్చి 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలోని మహిళల భద్రతే ధ్యేయంగా శక్తి బృందాలు పనిచేస్తాయని, మహిళల భద్రతకు పెద్ద కేటవేశామని, మహిళల భద్రతకు కొత్తగా ఏడు శక్తి బృందాలు ఏర్పాటు చేసినట్లు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ఎస్పీ బుధవారం శక్తి టీం వాహనా లకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూజిల్లాలో మహిళల భద్రత కోసం నూతనంగా 7 శక్తి బృందాలు ఏర్పాటు చేసి రంగంలోకి దింపామని ఎస్పీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆవరణలో జిల్లా ఎస్పీ పచ్చ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శక్తి - " మీ రక్షణ-మా ధ్యేయం" అనే నినాదంతో రూపొందించిన వాహనాలను ఎస్పీ ఈ సందర్భంగా ప్రారంభించారు.మహిళలు సురక్షితంగా ఉన్న చోట సమాజం సురక్షితంగా ఉంటుంది అని ఎస్పి అన్నారు. 24 గంటలు శక్తి టీమ్స్ విధి నిర్వహణలో ఉంటారన్నారు. బాలికలు, మహిళలు ఆపదలో ఉన్నప్పుడు సకాలంలో ఎలా స్పందించాలో, ఎంత సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలో శక్తి టీమ్స్ కు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్ళను మఫ్టీలో నిఘా వేస్తారన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ కు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112,9493206006( వాట్సప్ నెంబర్) కాల్స్ తో సంఘటన స్థలంకు ఈ టీమ్స్ వెళ్తాయన్నారు.కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టేలా దిశానిర్దేశం చేశారు. మహిళా చైతన్యం, స్వేచ్ఛ, భద్రత నినాదంతో శక్తి బృంద సభ్యులు పనిచేయాలని సూచించారు. మహిళలకు రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్ ఫోన్లలో ఇన్స్టాల్ చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)ఎన్. బి.ఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏ.వీ సుబ్బ రాజు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్. అర్జున్, డి.ఎస్.పి(ఎస్ బి) బి. రామకృష్ణ , జోనల్ డిఎస్పీలు, ఇన్స్పెక్టర్(ఎస్ బి) ఏ. శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్(డి సి ఆర్ బి) పవన్ కుమార్ రెడ్డి, శక్తి టీం మహిళా పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలోని రైతులకు అధిక రుణ సౌకర్యం కల్పించాలి





జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
బ్యాంకర్ల జిల్లా స్థాయి సమావేశం లో కలెక్టర్ విజ్ఞప్తి ..
ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతానికి చేరుకోవాలి..
నిరుపేదలకు రుణ సౌకర్యం కల్పించాలి..
ప్రభుత్వ ప్రాధాన్యతను బ్యాంకర్లు గమనించాలి..
బ్యాంకర్లకు కలెక్టర్ దిశ నిర్దేశం..

**బాపట్ల, మార్చి 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు బ్యాంకర్లు అధిక రుణ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.

ప్రాధాన్యత రంగాలు, ప్రాధాన్యత లేని రంగాలకు రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు నూరు శాతం చేరుకోవాలని కలెక్టర్ అన్నారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నందున నిరుపేదల జీవనోపాధి పెంచడానికి రుణ సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాంకు అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని ఆయన సూచించారు. నిరుపేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా రుణ పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్, చేనేతలకు ముద్ర రుణాలు, అన్ని విభాగాల కార్పొరేషన్ రుణాలు, కిసాన్ డ్రోన్స్, ఎన్ ఎల్ ఎం పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలన్నారు. గేదెల బీమా కోసం పశుబీమా పథకం అమలుపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఉత్పత్తి రంగాల అభివృద్ధికి అధిక రుణాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు కలిపి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగానికి 10,054 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, డిసెంబర్ 31వ తేదీ నాటికి 9,321 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు 1,154 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా, డిసెంబర్ నాటికి 862 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఇతర ప్రాధాన్యత రంగాలకు 514 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, డిసెంబర్ నాటికి 168 కోట్లు పంపిణీ చేశామన్నారు. మిగిలినవి ఇతర రంగాలకు రుణాలు అందజేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 13,444 కోట్ల రుణాలు పంపిణీ చేయాలని బ్యాంకర్లకు లక్ష్యాలు నిర్దేశించగా 93.50 శాతానికి చేరినట్లు వివరించారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి 12,569 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. గడిచిన రెండు నెలలు, రానున్న 20 రోజుల్లో నూరు శాతం లక్ష్యాలు చేరుకోవాలని తెలిపారు.

కౌలు రైతులకు 100 కోట్లు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం 1. 89 లక్షల మంది కౌలు రైతులకు కార్డులు జారీ చేశామన్నారు. వారికి ప్రస్తుతం 55 కోట్లు రుణం ఇవ్వగా, పంట రుణాలు అందించాలన్నారు. 7,900 చేనేత కుటుంబాలకు రుణ సదుపాయం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పొదుపు మహిళా సంఘాలకు లక్ష్యం మేరకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. ముద్ర రుణాల మంజూరులో ప్రస్తుతం 44.40 శాతం లక్ష్యం కాగా, నూరు శాతం లక్ష్యాలు చేరుకోవాలని పలు సూచనలు చేశారు. నిరుపేదల జీవనోపాధి వృద్ధి కలగాలంటే రుణాల లక్ష్యాలు మరింత అధికం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తున్న అంశాలపై బ్యాంకర్లు దృష్టి సారించి సహకరించాలన్నారు. సమావేశం ఆర్.బి.ఐ ఎల్డీఓ అభిషేక్, నాబార్డ్ డీడీఎం రవికుమార్, ఎల్ డి ఎం శివకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న సేవలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి

**జగిత్యాల :** బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన అంజిరెడ్డికి ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చా రణాలతో స్వాగతం పలికారు.అనంతరం అంజన్న ను దర్శించుకోగా అంజిరెడ్డి గోత్ర నామధులతో పూజారులు అర్చనలు చేసి ఆశీర్వధించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఏసిఎస్ రాజు, భావన ఋషి , మ్యన మహేష్ బాబు, బండారి మల్లికార్జున్,మల్యాల మండలం సీనియర్ నేత బొట్ల ప్రసాద్, మల్లేష్ యాదవ్, బింగి వేణు , బిట్టు పాల్గొన్నారు.

## 3జిల్లా లో పదవతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో పదవతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆదేశించారు..బుధవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి,చీఫ్ సూపరింటెంట్ వెహికల్ ఇంచార్జ్, సిట్టింగ్ స్వాడ్, ప్రిన్సిపల్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## సహజ వ్యవసాయం కోసం ఖరీఫ్ ప్రణాళిక

సేంద్రియ వ్యవసాయం చేయండి ఆరోగ్యం కాపాడుకోండి



**పాతపట్నం మార్చి 19, ప్రజా జ్యోతి న్యూస్..** ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సహజ వ్యవసాయ శాఖ, సెర్ప్, వ్యవసాయం మరియు ఏపీసీఎన్ఎఫ్ కన్వర్జెన్స్ ఆధ్వర్యంలో బుధవారం పాతపట్నం ఎంపిడిఓ కార్యాలయం వద్ద సమావేశం జరిగింది. డిపిఎం (రేవతి) అడిషనల్ డిపిఎం ( ధనుంజయరావ), ఎఇఓ(భారతి), సర్పంచ్( సవర సిందు), ఎంపిటీసి(సరస్వతి)నాయకత్వంలో పెద్దలొగిడి , చిన్నమల్లిపురం, రొమాదాల,తీమర, కొర్సవాడ యూనిట్స్ సహజ వ్యవసాయ ప్రణాళికపై చర్చలు జరిగాయి ఈ సమావేశంలో డిపిఎం పిఎండిఎస్ యొక్క ఉపయోగాలు అదేవిధంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్, విఓఏ , విఓ -ఓబి, విఏఏ విధులు బాధ్యతలు గురించి వివరించారు. ఏపి సిన్ఫ్ యొక్క 9సార్వత్రిక సూత్రాలు ఉపయోగాలు గురించి తెలియజేశారు.ఎంఎంటీల్ సువర్ణ రాజు, యం.టీ.సంజీవరావు, యూనిట్ ఇన్చార్జిలు ఐసీఆర్పీలు, వీఓఏలు, విఏఏలు,సీసీలు సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లి మండలం కుకునూరులో పునర్ రీ సర్వే పనులు


సి సి ఎల్ ఏ ఆదేశాలతో రీ సర్వే..
ఆర్డీవో రాణి సుస్మిత



**దేవరపల్లి, మార్చి 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** గోపాలపురం నియోజక వర్గం దేవరపల్లి మండలం కుకునూరు గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే పై అభ్యంతరాలు నేపథ్యంలో సి సి ఎల్ ఏ కమీషనర్ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు రెవిన్యూ డివిజన్ అధికారి రాణి సుస్మిత తెలిపారు.
బుధవారం కుకునూరు గ్రామంలో రీ సర్వే నిమిత్తం ఆర్డీవో అధికారులతో కలిసి పర్యటించారు. భూ యజమానులు, రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో కూడి భూముల రీ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు, రీ సర్వే లో తగిన వివరాలు అందచేసి అధికారులకి, క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సహకరించాలని ఆర్డీవో రాణి సుస్మిత కోరారు కార్యక్రమంలో తహశీల్దార్, ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వే, సర్వే బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు

## బాపట్ల వాసి బొడ్డుపల్లి వెంకట శివకుమార్‌కు డాక్టరేట్..

తండ్రి ఆశయాలు కొనసాగిస్తున్న తనయుడు..



**బాపట్ల, మార్చి 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** దేశంలోనే అత్యుత్తమ ప్రతిష్టాత్మకమైన విశ్వ విద్యాలయాల్లో ఒకటైన బిట్స్ పిలాని విశ్వవిద్యాలయం హైదరాబాద్ కేంద్రం నుండి బాపట్ల కు చెందిన బొడ్డుపల్లి వెంకట శివ కుమార్ పి హెచ్ డి డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. బాపట్ల పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులోని బొడ్డుపల్లి వారి వీధికి చెందిన రిటైర్డ్ పంచాయతీరాజ్ శాఖ అధికారి బొడ్డుపల్లి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సత్యవతిలా పెద్ద కుమారుడు బొడ్డుపల్లి వేంకట శివకుమార్ ఆచార్యులు డాక్టర్ కె వి జి చంద్రశేఖర్ పర్యవేక్షణలో డిజైన్, సింథసిస్ అండ్ బయలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ నైట్రోజన్ బేస్డ్ హేటిరో సైకిల్స్ యాజ్ యాంటీ ట్యుబర్కులర్ ఏజెంట్స్" అనే అంశంపై పరిశోధన విజయవంతంగా పూర్తి చేశారు. బిట్స్ - హైదరాబాద్ డాక్టరల్ అడ్వైజరీ కమిటీ సభ్యులైన డాక్టర్ అనుపమ్ భట్టాచార్య మరియు డాక్టర్ మానబ్ చక్రవర్తి వారి సూచనలతో ఎగ్జామినర్స్ అయినా డాక్టర్ ఉదయ్ కుమార్ (ఎన్ ఐ టి సూరత్కల్ ) మరియు డాక్టర్ పవన్ కుమార్ (ఐ.ఐ.టి గౌహతి ) కి తన థీసిస్ ను పంపించారు. వారు థీసిస్ ను క్షుణ్ణంగా పరిశీలించి , సంతృప్తి చెంది, ఆమోదించడం జరిగింది. కాగా బొడ్డుపల్లి వెంకట శివ కుమార్ తండ్రి బాపట్ల కు చెందిన కీర్తిశేషులు బొడ్డుపల్లి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గతంలో పంచాయతీరాజ్ శాఖలో పనిచేసి పదవీ విరమణ పొంది , అప్పట్లో మాజీ మంత్రి, బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు అయినా గాదే వెంకటరెడ్డి పీ.ఏ గా పనిచేశారు. తరువాత ఎల్.ఎల్ .బి పూర్తి చేసి బాపట్ల బారసోసియేషన్ లో సభ్యులుగా కొనసాగుతూ బాపట్ల వాసులకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించి 2021లో మరణించారు. తండ్రి స్ఫూర్తితో బొడ్డుపల్లి వెంకట శివకుమార్ ఉద్యోగం చేస్తూ క్లిష్టమైన పీహెచ్డీ కోర్సును పూర్తి చేయటం గమనార్హం . తండ్రి కల నెరవేర్చడం చాలా ఆనందంగా ఉందని ఈ క్షణం ఆయన లేకపోవడం బాధాకరమని తెలిపారు. అంతేగాక ఎన్నో ఒడిదుడుకుల్లో తనకు తగిన ప్రోత్సాహం సహాయ సహకారాలు అందించిన తన భార్య బాలచంద్రిక తన డిగ్రీ సాధించడానికి పూర్తిగా దోహద పడిందని చెప్పారు. శివకుమార్ తన ఇద్దరు పిల్లలు అయినా హిమనీష్, శ్రేయాన్ష్ కూడా భవిష్యత్తులో మంచి పరిశోధన చేయగలరని ఆశిస్తున్నానని చెప్పారు. మానవాళికి ఉపయోగపడే శాస్త్రీయ పరిశోధనలు ఇంకా జరగాలని తన వంతు కృషిగా డాక్టరేట్ ను పొందడమే కాకుండా సమాజానికి సాధ్యమైనంత మేలు జరిగేలా కృషి చేస్తానని ప్రతిభ కలిగిన వారికి తగిన సూచనలు సలహాలు అందించి మంచి ఉద్యోగ అవకాశాలు అందించేటట్లుగా కృషి చేస్తానని డాక్టర్ శివకుమార్ తెలిపారు.

# యువతి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

**పది వేల రూపాయల జరిమానా..**
**శిక్ష పడే విధంగా కృషిచేసిన అధికారులను అభినందించిన ఎస్పీ తూషార్ దూడి..**




**బాపట్ల, మార్చి 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2013లో యువతని హత్య చేసినట్లు నమోదైన కేసుకు సంబంధించి బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష , పదివేల రూపాయలు జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో నేరస్థుడికి జైలు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పోలీస్ అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ దూడి ప్రత్యేకంగా అభినందించారు.నేరం చేసిన వారికి శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లు అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. వివరాల్లో పెడితే కృష్ణాజిల్లా, మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన బోల్లిపోగు రాణి (మృతురాలు) 10వ తరగతి వరకు చదివి ఆ తరువాత చదువును ఆపివేసింది. 2012 సంవత్సరంలో గుంటూరులోని చైతన్య కళాశాలలో కేర్ టేకర్గా చేరింది. అక్కడే నిందితుడు గారపాటి రాజశేఖర్ ప్రైవేట్ ఎలక్ట్రిషయన్ గా పనిచేస్తున్నాడు. ఇద్దరికీ పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఈ విషయం తెలుసుకున్న చైతన్య కళాశాల అధికారులు ఆమెను స్వగ్రామానికి పంపించారు. 2013 సంవత్సరంలో సంక్రాంతి పండుగ తర్వాత ఆమె గుంటూరులోని వికాస్ నగర్‌లోని ఎన్నారై కళాశాలలో స్టూడెంట్స్ ఇన్‌చార్జ్ గా చేరింది. కానీ రాజశేఖర్ చైతన్య కళాశాల లోనే పనిచేస్తున్నాడు. అయితే వారిద్దరూ తమ సంబంధాన్ని కొనసాగించారు. ఆమె వివాహం చేసుకోవాలని అతడిని అడుగుతున్నప్పటికి ఆ ప్రతిపాదనను నిందితుడు రాజశేఖర్ తిరస్కరించాడు. ఇలా ఉండగా 20 13 మార్చి 22 సాయంత్రం ఆమెను ఒప్పించి బాపట్ల మండలంలోని అడివి పంచాయతిలో మత్స్య శాఖ శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ సమీపంలోని ఏకాంత ప్రదేశానికి తీసుకువచ్చి, ఆమె పై లైంగిక దాడి చేసి కత్తితో ఆమె ను పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర గాయాలైన యువతి అతను బారి నుండి తప్పించుకుంటూ శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌లోని 3వ గది నుండి ముళ్ల పొదలపై పడి మరణించింది. మరుసటి రోజు యువతి మృతదేహాన్ని గుర్తించారు. అప్పటి బాపట్ల రూరల్ ఎస్.ఐ వై. కోటేశ్వర రావు హత్య కేసుగా నమోదు చేసి అప్పటి బాపట్ల రూరల్ సీఐ వై. రామారావు కేసు దర్యాప్తు నిర్వహించారు. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం, భౌతిక సాక్షాదారాల ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో న్యాయస్థానం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలీస్ అధికారులను, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ కె. శ్రీనివాస రావు, బాపట్ల జిల్లా కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ ఈశ్వర్, సెషన్స్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ జి. శివయ్య లు, ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. శ్రీకాంత్ లను జిల్లా ఎస్పీ తుషార్ దూడి ప్రత్యేకంగా అభినందించారు. నేరం చేసిన వారికి న్యాయ స్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లు అవుతుందని, ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు నేరస్తులలో భయం అనేది ఏర్పడుతుందన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని ఈ తీర్పుతో రుజువైందని ఎస్పీ వ్యాఖ్యానించారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి..



**పోదూరు,మార్చి19,ప్రజాజ్యోతి న్యూస్.** భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేలా రూపొందిచిన కౌలు చట్టాన్ని వెంటనే ఆమోదించాలని కౌలురైతుల సంఘం డిమాండ్గత ప్రభుత్వం తెచ్చిన భూయజమానులు సంతకం చేస్తేనే కౌలు కార్డులు ఇవ్వాలనే నిబంధనలు తొలగించి, రాష్ట్ర ప్రభుత్వమే కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇచ్చేలా తీసుకొచ్చిన నూతన కౌలురైతుల చట్టం ముసాయిదాను ఈ అసెంబ్లీ సమావేశాల్లోఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులుడిమాండ్ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామిగా ఇచ్చిన భూయజమానుల సంతకంతో సంబధం లేకుండా కౌలురైతులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంటనమోదు, కౌలురైతుల పేరున చేసిపంటరుణాలు, నష్ట పరిహారంకౌలురైతులకు ఇచ్చేలాచర్యలుతీసుకోవాలని కౌలురైతుల సంఘం ఆద్వర్యంలో సంతకాలు సేకరించిరాష్ట్రముఖ్యమంత్రి కి మండల తహశీల్దార్ వారి ద్వారా వినతిపత్రాలుఅందజేస్తున్నామన్నారు.ఇందులో భాగంగాఆచంటతహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి బుధవారం తహశీల్దార్ జి.కనకరాజు కి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగాఆయనమాట్లాడుతూసమస్యనుప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కౌలురైతులకుగుర్తింపుకార్డులుఇస్తామని తెలిపారన్నారు.ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు కేతా పూర్ణారావు, కౌలురైతులు కొండేటి సత్యనారాయణ,, బండిరంగా రావు, కేతా మోహన్ రావు, బండి శ్రీనివాసు, కుడిపూడి శ్రీనివాస్, కేతాఆది నారాయణ, ప్రజాసంఘాలనాయకులుమోహన్,టి.సత్యనారాయణ, సిహెచ్నర్సింమూర్తి, బి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు






- **కేశవదాసు పురం వద్ద బారిగేట్లు ఏర్పాటు**
- **రెడ్డి పేట లో సంకల్పం కార్యక్రమం**
- **పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు**
- **పలు కార్యక్రమాల్లో ఎస్. ఐ సత్యన్నారాయణ**




**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు నాగార్జున అగ్రికం కార్పొరేషన్ లిమిటెడ్ వారు ప్రమాదాల నివారణ కొరకు స్థానిక ఎస్. ఐ సత్యన్నారాయణ కు బారి గేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్. ఐ తన సిబ్బంది తో కేశవదాసు పురం వద్ద బారిగేట్లు ఏర్పాటు చేశారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి:**
జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్. ఐ సత్యన్నారాయణ అన్నారు. పొందూరు మండలం రెడ్డి పేట గ్రామంలో సంకల్పం కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను , సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలను వినియోగించుకుని విక్రయిం చిన చట్టరీత్యా నేరమని తెలిపారు.సైబర్ క్రైమ్ బారిన పడకుండా ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని నెంబర్లతో ఫోన్ లో వచ్చే మేసేజ్ లకు , ఫోన్ కాల్స్ కు స్పందించవద్దని తెలిపారు.

**ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు**
ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలు జరిగేలా ఎస్. ఐ సత్యన్నారాయణ చేపట్టారు. ఈ మేరకు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అనుక్షణం పోలీసులు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరైనా మాస్ కాపీయింగ్ కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఆధారం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకున్న కలెక్టర్..



**బాపట్ల, మార్చి 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** కుటుంబానికి ఆధారమైన వ్యక్తి అర్ధాంతరంగా చనిపోవడంతో ఆధారం కోల్పోయిన కుటుంబానికి సహృదయంతో జిల్లా కలెక్టర్ చేయూతని అందించి తన ఉదారణను చాటుకున్నారు. ఆ నిరుపేద కుటుంబానికి చేయూతని అందించారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన దోమతోటి సందీప్ అనే యువకుడు ఎలక్ట్రిషన్ గా పనిచేస్తూ కొద్ది నెలల క్రితం విద్యుత్ స్తంభంపై విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఇటీవల మృతుని తల్లి ప్రజా విజ్ఞప్తుల వేదికలో జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో చలించి పోయిన జిల్లా కలెక్టర్ ఇరువురి అధికారులను విచారణకు ఆదేశించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉండడం, కుటుంబానికి జీవనోపాధి లేక ఇబ్బంధులు పడటంతో ఎలాగైనా ఆ కుటుంబానికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. మృతుని సోదరుడు దోమతోటి సునీల్ కుమార్ కు పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగాన్ని కల్పించి ఆ కుటుంబానికి అండచూపారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో కమాటీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. తక్షణమే ఆ ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ స్వయంగా సునీల్ కుమార్ కు అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబం జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కి కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని జె రాజదిబోరా, తదితరులు పాల్గొన్నారు.

# జలజీవన్ మిషన్ కింద జిల్లాకు 149 కోట్లు మంజూరు..

**జిల్లా కలెక్టర్ వెంకట మురళి..**
**337 పనులు లకు ఈ నిధులు మంజూరు..**






**బాపట్ల, మార్చి 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జలజీవన్ మిషన్ క్రింద జిల్లాకు 149 కోట్ల రూపాయలతో337 పనులు మంజూరు అయినట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డిస్టిక్ వాటర్ శానిటేషన్ మిషన్ జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ క్రింద ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు చెప్పారు. జిల్లాలోని సమగ్ర నీటి సరఫరా పథకాలను, త్రాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలోని త్రాగునీటి పథకాలను మరమ్మత్తులు చేపడ్డానికి గుంటూరు ప్రకాశం జిల్లా పరిషత్ 15 ఆర్థిక సంఘం నిధులు ఎంత వచ్చాయి ఎంత విడుదల చేశారు అనే విషయాలను సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే త్రాగునీటి పథకాలకు బోర్ల మరమ్మత్తులకు గ్రామస్థాయిలో పంచాయతీలకు 15 ఆర్థిక సంఘం నిధులు ఎంత మంజూరు అయ్యాయిఅనే విషయాల పై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మరమ్మతులకు గురైన అంగన్ వాడి కేంద్రాలలో టాయిలెట్లను మరమ్మత్తులు చేపట్టడానికి ప్రతిపాదన తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలో మురుగునీటి కాలువల నిర్మాణా లకు గ్రామ పంచాయ తీకి 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా మంచినీటి పథకాలను సాగర్ కాలువ ద్వారా పూర్తిస్థాయిలో నింపుకోవాలని అధికారులకు సూచించారు. సముద్ర తీరంలో 6 బీచ్ లు ఉన్నాయని వాటి వద్ద 10బయో టాయిలెట్స్ ను ఏర్పాటు చేయవలసిందిగా పంచాయతి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ఎంపీడీఓ లు ప్రతిపాదనలు తయారుచేసి పంపాలని ఆయన చెప్పారు. గ్రామ పంచాయతీల్లో త్రాగునీరు కలుషితం కాకుండా ప్రతినెల మెడికల్ మెడికల్ అధికారులు వాటర్ టెస్టింగ్ చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణనీటిసరఫరా శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ అనంత రాజు, జిల్లా పంచాయ తీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి, జిల్లావ్యవసాయ శాఖఅధికారి రామకృష్ణ,గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఇఓ కృష్ణ, ప్రకాశం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఇఓ బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జి చిన్న శ్రీనుకు పుత్ర వియోగం

**- అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని**



**విజయనగరం , ప్రజా జ్యోతి న్యూస్ :** విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్,జిల్లా పార్టీ అధ్యక్షులు ,భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు ( చిన్న శ్రీను ) కు పుత్ర వియోగం కలిగింది. చిన్న శ్రీను ద్వితీయ కుమారుడు మజ్జి ప్రణీత్ బాబు 2020 14వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సుమారు 5 సంవత్సరాల పాటు మృత్యువుతో పోరాడిన ప్రణీత్ బాబు బుధవారం నాడు తన తుదిశ్వాస విడిచాడు. ఈ విషయం తెలిసిన మాజీ స్పీకర్ , శ్రీకాకుళం జిల్లా పార్లమెంట్ పరిశీలకులు తమ్మినేని సీతారాం చిన్న శ్రీను కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తమ్మినేని తో పాటు మాజీ డిప్యూటీ స్పీకర్ కొరుగట్ల వీరభద్ర రావు ,వైఎస్సార్సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు( లక్ష్మణ రావు ) ,ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ ,వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు,జెడ్పీటీసీ లోలుగు కాంతా రావు,మాజీ మంత్రులు , మాజీ ఎమ్మెల్యేలు, వివిధ హోదాల్లో గల నాయకులు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## కిర్లంపూడి మండల బిజెపి అధ్యక్షుడిగా శరకణం రాజబాబు



**కాకినాడ ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన శరకణం రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాజబాబు గ్రామంలో ప్రముఖ ఆర్ఎంపి వైద్యులుగా వైద్య సేవలు అందించడమే కాకుండా, భారతీయ జనతా పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.మండల నూతన కమిటీ అధ్యక్షుడు నియామకానికి మంగళవారం మండల కేంద్రమైన కిర్లంపూడి విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు,జగ్గంపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు,మట్టా మంగరాజు,కామినేని జయశ్రీ పలువురు బిజెపి నాయకులు సమక్షంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు.ఈ ప్రక%ా

## మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మీసేవ కేంద్రాల సంఘం సభ్యులు



బద్వేల్ మార్చి 19 (ప్రజా జ్యోతి న్యూస్) మీసేవ కేంద్రాలకు గత వైసిపి ప్రభుత్వం తీసివేసిన సర్వీసులను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడం పై కడప జిల్లా మీసేవ కేంద్రాల సంఘం అధ్యక్షుడు ఆదేశాల మేరకు బద్వేల్లో మీసేవ సంఘం వైస్ ప్రెసిడెంట్ తిరువీధి ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని సంఘాలు సభ్యులు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. బద్వేల్ దళిత ప్రజాసంఘాల నాయకులు ముళ్ళపాటి పిచ్చయ్య, బత్తల కురి కేశవయ్య తమ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, రవీంద్రారెడ్డి, కార్తిక్, గోపికృష్ణ, రామ బ్రహ్మాచారి , నాగిపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ మరియు ఏపిసిఎన్ఎఫ్ స్టాఫ్‌కి శిక్షణ : ఏంఏఓ రామకృష్ణ



బద్వేల్ మార్చి 19 (ప్రజా జ్యోతి న్యూస్) బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం రాచాయిపేట రైతు సేవకేంద్రం. మండలంలో పని చేయుచున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, గ్రామ వ్యవసాయ సహాయకులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ప్రస్తుతం ఈ సీజన్ లో జరిగే వ్యవసాయ పంటలకు మరియు ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లు అనగా మందు పంపులు, ట్రాక్టర్ పనిముట్లు గురించి వివరంగా వివరించారు, అలాగే నీటి పైపుల వివరాలు

63 %వీవీ% (2 ఇంచెస్) -450.00

75 %వీవీ% (2.5ఇంచెస్)-680.00

90 %వీవీ% ( 3 ఇంచెస్)-840.00

110 %వీవీ% (4 ఇంచెస్)-1128.00

సబ్సిడీ ఒక పైప్ ?210.00 అని వివరించారు అలాగే ట్రాక్టర్ పనిముట్లుగురించి వివరాలు ఆర్బికే సహాయకులను సంప్రదించండి అని చెప్పారు. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## మండల సమాఖ్య కార్యాలయంలో వివో,విఓఏలకు శిక్షణా కార్యక్రమం



కాకినాడ ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్.. ఫోక్సో చట్టంపై యుక్త వయసులో ఉన్న బాలికలకు అవగాహన కలిగించవలసిన అవసరం ఎంతైనా ఉందని పదాల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్స్ శ్రీనివాస్,డిఆర్డిఏ, హ్యూమన్ డెవలప్మెంట్ రిసోర్స్ పర్సన్ యాంకర్ ,జి అనిల్ కుమార్ లు అన్నారు.బుధవారం మండల కేంద్రమైన కిర్లంపూడి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వివో నాయకులకు,వివోఏలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఏపీఎం శరకణం వేదకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ,వ్యక్తిగత విద్య, ఇది నా తప్పు కాదు, వ్యక్తిగత భద్రతా నియమాలు,ఇంటర్నెట్ సేఫ్టీ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, గ్రామస్థాయిలో తమ పరిధిలో ఉన్న బాలికలకు ఫోక్సో చట్టం పై అవగాహన కలిగించాలని వి ఓ, నాయకులను,వివోఏలను వారు కోరారు.ఈ కార్యక్రమంలో సీసీలు, బుల్లియ్య,సత్య ప్రసాద్, లోవరాజు, శాంత, సంధ్య, అధిక సంఖ్యలో వివో నాయకులు,వివోఏలు పాల్గొన్నారు

# మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్: నరసింహారెడ్డి

బద్వేల్ మార్చి 19 (ప్రజా జ్యోతి న్యూస్) వార్డ్ ప్లానింగ్ సెక్రటరీ లతో సమీక్ష సమావేశం నిర్వహించిన మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ. మునిసిపాలిటీ పరిధిలోని లేఅవుట్ ఓపెన్ స్పేస్ లు, ప్రజా ప్రయోజనార్థం కొరకు వదిలిన మునిసిపల్ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. భవన నిర్మాణ అనుమతుల కొరకు దరఖాస్తు చేయు సమయంలో సంబంధిత పత్రాలు సమర్పించి పొందిన ప్లాన్ ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. భవనాలు నిర్మించేటప్పుడు కంకర,సిమెంట్ ,ఇసుక మొదలగునవి రోడ్డు మీద వదలి రోడ్లను అపరిశుభ్రం చేయడంతో పాటు పాదాచారులకు అసౌకర్యంగా వుండటం జరుగుతుందన్నారు. అలా చేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బద్వేల్ పురపాలక సంఘము లో అనుమతులు లేకుండా ఎలాంటి కట్టడాలు కట్టరాదన్నారు. ప్రభుత్వ స్థలాలలో కట్టడాలను ఆక్రమించి కడితే రెవిన్యూ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని తొలగించాలన్నారు. ఈ సమావేశంలో కమీషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్ , టిపిబిఓలు. మరియు పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.





## ధర్మవరం గ్రామంలో మురళిరాజుపర్యటన



ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు... ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం చెందిన దాసరి ధర్మరాజు ఇటీవల స్వర్గస్తులయ్యారు వారి కుటుంబం సభ్యులు పరామర్శించిన. ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ %డ% ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,గుమ్మడి రామకృష్ణ , నానిపల్లి రమణ,దోమలంక బాబ్జి ,తిమ్మిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు

# ఎగుమతుల అడ్డాగా బాపట్ల... బాపట్ల దశ మారనుంది ఎమ్మెల్యే వేగేశన...

బాపట్ల జిల్లా మార్చ్ 19 ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల రైల్వే స్టేషన్ లో గూడ్స్ వ్యాగన్ నిలుపుదలకు అనుమతులు మంజూరు చేసిన రైల్వే శాఖ జిల్లా కేంద్రమైన బాపట్ల రైల్వే స్టేషన్ లో బాపట్ల నుండి ఇతర ప్రాంతాలకు ఎగుమతుల నిమిత్తం గురువారం 20వ తేదీ న మొదటి వ్యాగన్ రాక సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు బాపట్ల నుండి బియ్యం ఇతర ఎగుమతులు దిగుమతులు కొరకు బాపట్ల రైల్వే స్టేషన్ లో గూడ్స్ వ్యాగన్ నిలుపుదలకు వ్యాగన్ పాయింట్ కి రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేసింది ఈ సందర్భంగా రేపు ఉదయం 8.30 గంటలకు మొదటి గూడ్స్ వ్యాగన్ రాబోతుంది దీనికి స్వాగతం పలకడానికి ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు కార్యకర్తలు ప్రజలు హాజరు కానున్నారని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు తెలియజేశారు



## బెయిల్ పై విడుదలైన 8 మంది వైసిపి కార్యకర్తలు

– కార్యకర్తలను కలిసి భరోసా కల్పించిన చింతాడ రవికుమార్



పొందూరు, ప్రజా జ్యోతి న్యూస్: పొందూరు మండలం భాజీపేట గ్రామంలో ఇటీవల టిడిపి ,వైసిపి వర్గీయుల మధ్య జరిగిన రాజకీయ కొట్లాట కేసులో 8 మంది పైన కేసు నమోదు చేశారు. ఈ మేరకు 42 రోజుల పాటు రిమాండ్ లో ఉన్న 8 మంది బుధవారం నాడు బెయిల్ పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ తమ పార్టీ కార్యకర్తలను కలిసి భరోసా కల్పించి ,పార్టీ అండగా ఉంటుందన్నారు. చింతాడ రవితో పాటు వైకాపా జిల్లా అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్,గురుగుబెల్లి శేఖర్ , బొమ్మాల గిరి ఉన్నారు

# అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలి

జగిత్యాల : నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు.బుధవారం రోజున జిల్లా లోని రాయికల్ మండల బోర్నపల్లి గ్రామంలోని 20 లక్షల వ్యయంతో చేపట్టుతున్న హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ దశలో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నెల రోజుల లోపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.అలాగే ఇటిక్యాల గ్రామంలో 9 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను అధికారులతో కలిసి పరిశీలించి. నెల రోజుల వరకు త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. అల్లిపూర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో చేపడుతున్న పల్లె దవఖాన సబ్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి.ఏప్రిల్ మొదటి వారంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.సారంగాపూర్ మండలం లచ్చక్క పేట గ్రామంలో చేపడుతున్న సిసి రోడ్ వర్క్స్ అని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.నాగునూర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో చేపడుతున్న పల్లె దవాఖాన నిర్మాణ దశలో ఉన్న పనులను పరిశీలించి. 2 నెలల లోపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. హెల్త్ సబ్ సెంటర్లు ఎన్ఆర్ఈజీఎస్ క్రింద చేపడుతున్న సిసి రోడ్డు వర్క్స్ అన్ని కూడా వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో, మధుసూధన్, డిఈ మిలింద, ఎమ్మార్వో, ఎంపీడీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## చౌక దుకాణాలలో ఈ కేవైసీ నమోదు చేసుకోండి



బద్వేల్ మార్చి 19 (ప్రజా జ్యోతి న్యూస్) బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో నివాసం ఉన్నటువంటి రేషన్ కార్డుదారులకు తెలియజేయడమేమనగా రేషన్ కార్డులో నమోదుకాబడి ఉన్న సభ్యులందరూ తమ యొక్క ఆధార్ కార్డులు మరియు రేషన్ కార్డులు తమతో తీసుకువెళ్ళి ప్రతి రేషన్ కార్డు దారులు తమ సమీపంలో ఉన్న చౌక దుకాణం లో ఈ నెల అనగా మార్చి 31వ తేదీ లోపల ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని ఆర్డీవో తెలిపారు.

## పట్టణ ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

కోరుట్ల : పట్టణ ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం అని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు అన్నారు.పట్టణాలు రోజురోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా అమృత్ 2.0 ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారని తెలిపారు.దీనిలోభాగంగా కోరుట్ల మున్సిపాలిటీకి 41. 50 కోట్ల నిధులు విడుదల కావడం జరిగిందని, దీంట్లో భాగంగా బుధవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు, కోరుట్ల పట్టణ విలీన గ్రామమైన ఎకిన్ పూర్ పట్టణ శివారులో గల శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పైపులైన్ ద్వారా తాళ్లచెరువు లో నీళ్ళు నింపడం కోసం ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్

# తమలపాకులో దాగివున్న హెల్త్ సీక్రెట్స్!



ఈ ఆకు వల్ల కడుపులో అజీర్తి, గ్యాస్ సమస్య రాదు. తమలపాకు వల్ల రొంప సమస్యలు త్వరగా తగ్గిపోతాయి. శ్వాసనాళాలు క్లియర్ అవుతాయి. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్ తగ్గిస్తుంది. అంతేకాదు తమలపాకు షుగర్ కూడా నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటీవ్ మెరుగు చేస్తుంది. తమలపాకుల్ని మనం జ్యూస్‌లా చేసుకుని తాగొచ్చు. దీని వల్ల మనకి శ్వాస సమస్యలు దూరమవుతాయి.తమలపాకులో దాగివున్న ఆరోగ్య ప్రయోజనాలు దాదాపు చాలా మందకి తెలియదు.. ఇందులో ఉండే విటమిన్స్ అన్నీ ఇన్నీ కావు. తమలపాకులో విటమిన్ ఎ, బి కాంప్లెక్స్, విటమిన్ ఈలు ఉంటాయి. వీటితో పాటు పొటాషియం, కాల్షియం, అయోడిన్, పాస్ఫరస్, ఐరన్, అమైనోయాసిడ్స్, ఎంజైమ్స్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ అన్నీ ఉంటాయి. ఇవన్నీ కూడా మన ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకంగా పనిచేస్తాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ ఆకుల్ని మనం సరైన విధంగా తీసుకుంటే షుగర్ దగ్గర్నుంచీ చాలా సమస్యలకి చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. తమలపాకు తీసుకోవడం వల్ల మలబద్ధక సమస్య తగ్గిపోతుంది. ఈ ఆకు వల్ల కడుపులో అజీర్తి, గ్యాస్ సమస్య రాదు. తమలపాకు వల్ల రొంప సమస్యలు త్వరగా తగ్గిపోతాయి. శ్వాసనాళాలు క్లియర్ అవుతాయి. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్ తగ్గిస్తుంది. అంతేకాదు తమలపాకు షుగర్ కూడా నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటీవ్ మెరుగు చేస్తుంది. తమలపాకుల్ని మనం జ్యూస్‌లా చేసుకుని తాగొచ్చు. దీని వల్ల మనకి శ్వాస సమస్యలు దూరమవుతాయి. పంటి సమస్యతో బాధపడుతున్న వారు తమలపాకు తీసుకోవాలి. ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇది పళ్లలో బ్యాక్టీరియా పెరగకుండా చిగుళ్లను పంటిని కాపాడుతుంది. అంతేకాదు తమలపాకు తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యానికి ప్రేరేపిస్తుంది. ఇది డైజెస్టివ్ ఎంజైమ్‌లను వేరు చేయడంలో సహాయపడుతుంది. తమలపాకులో గాయాలు నయం చేసే గుణాలు కూడా ఉంటాయి. తమలపాకు తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు.

# పొద్దుతిరుగుడు విత్తనాలు తింటే ఏం జరుగుతుంది?



పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి ఎన్నో లాభాలను అందిస్తాయి. వీటిలో ప్రోటీన్, కాల్షియం, ఐరన్, జింక్ వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. రోజూ కొంతమేర తింటే శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అందుతాయి. వీటిని కాల్చి తింటే మరింత ప్రయోజనం పొందొచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాల్లో మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచి దృఢంగా మారేలా చేస్తాయి. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ ఎముకల బలహీనత సమస్యలు రావచ్చు. అలాంటి సమయంలో ఈ విత్తనాలను ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. ఫోలేట్ ఎక్కువగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలు పురుషులు, మహిళలకు పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడతాయి. ఫోలేట్ శిశువులలో నాడీ గొట్టపు లోపాలను తగ్గించడంలో సహాయపడుతుంది. వీటిలో ఉన్న జింక్ పురుషులలో స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరిచే లక్షణాలను కలిగి ఉంది. విటమిన్ ఇ సమృద్ధిగా ఉండటంతో పొద్దుతిరుగుడు విత్తనాలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా తేమతో నిండినట్లు ఉంచుతాయి. జుట్టు ఆరోగ్యంగా దృఢంగా మారేందుకు ఈ విత్తనాలు ఉపయోగపడతాయి. కాలుష్యం, వయసు పెరిగే కొద్దీ వచ్చే చర్మ సమస్యలను తగ్గించేందుకు సహాయపడతాయి.పొద్దుతిరుగుడు విత్తనాల్లో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, హృదయ సంబంధిత వ్యాధుల రిస్క్‌ను తగ్గిస్తాయి. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో కూడా ఇవి సహాయపడతాయి. పొద్దుతిరుగుడు విత్తనాల్లో మెగ్నీషియం, ఫైబర్, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ లెవల్స్‌ను క్రమబద్ధీకరించడానికి సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారు ఇవి తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్లు వంటి యాంటీఆక్సిడెంట్లు పొద్దుతిరుగుడు విత్తనాల్లో అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించి క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. బీటా-సిటోస్టెరాల్ సమృద్ధిగా ఉండటంతో రొమ్ము క్యాన్సర్‌ను నివారించేందుకు వీటివల్ల ప్రయోజనం కలుగుతుంది. పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్ అధికంగా ఉంటాయి. ఇవి తిన్న వెంటనే శరీరానికి తృప్తిని ఇచ్చే ఆహారంగా పనిచేస్తాయి. కరిగే ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆకలి నియంత్రణలో ఉండేలా సహాయపడటంతో బరువు పెరగకుండా ఉంటారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి శరీరానికి పోషకాలను అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. చిన్న పిల్లలు, పెద్దవారు అందరూ తినేందుకు అనువైనవి. రోజూ కొంత పరిమాణంలో తింటే శరీరానికి కావాల్సిన అనేక ప్రయోజనాలను అందించగలవు.

# బెల్లం వర్సెస్ పంచదార ఏది ఆరోగ్యానికి మంచిది?

బెల్లం మన సంప్రదాయ ఆహారంలో చాలా ముఖ్యమైనది. ఇది సహజంగా తీయగా ఉండి ఆరోగ్యానికి కూడా మంచిదని చాలా మంది నమ్ముతారు. అయితే ఇటీవల బెల్లం తింటే కిడ్నీలు దెబ్బతింటాయి అనే మాట ప్రచారం అవుతోంది. ఇది నిజమేనా..? లేక ఇది కేవలం అపోహ మాత్రమేనా..? బెల్లం చెరకు రసం లేదా తాటి రసం నుండి తయారవుతుంది. ఇది శుద్ధి చేయని సహజ తీపి పదార్థం కాబట్టి ఇందులో ఖనిజాలు, విటమిన్లు సహజంగా ఉంటాయి. బెల్లంలో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తిని అందించడంతో పాటు, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. జీర్ణ వ్యవస్థకు మేలు.. బెల్లం తినడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను ఉత్తేజపరచి మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. శక్తిని అందించే సహజమైన మూలం.. దీంట్లో గ్లూకోజ్, సుక్రోజ్ ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అలసటగా ఉన్నప్పుడు కొద్దిగా బెల్లం తింటే శరీరానికి ఉత్సాహం వస్తుంది. రక్తహీనత నివారణ.. బెల్లంలో ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల ఇది హీమోగ్లోబిన్ స్థాయిని పెంచి రక్తహీనత సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. దీంట్లో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల శరీరాన్ని హానికరమైన టాక్సిన్స్ నుంచి రక్షిస్తుంది. కాలేయాన్ని శుభ్రపరుస్తుంది.. బెల్లం నేచురల్ డిటాక్సిఫైయింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచి ఆరోగ్యంగా ఉంచుతుంది. బెల్లం అధికంగా తీసుకోవడం వల్ల సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. బెల్లంలో సహజంగా చక్కెర ఉండటంతో దీన్ని అధికంగా తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు బెల్లం ఎక్కువగా తింటే అది కిడ్నీలపై ఒత్తిడిని పెంచి దీర్ఘకాలికంగా సమస్యలను పెంచొచ్చు. బెల్లంలో పొటాషియం ఉంటుంది. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారిలో పొటాషియం స్థాయిలు పెరిగితే అది హానికరం కావచ్చు. లిమిటెడ్ గా తీసుకోవడం ఏ ఆహారమైనా మితంగా తీసుకుంటే మంచిది. రోజుకు 1-2 టేబుల్ స్పూన్ల బెల్లం తీసుకోవడం సాధారణంగా సురక్షితం. అయితే డయాబెటిస్ ఉన్నవారు లేదా కిడ్నీ సమస్యలు ఉన్నవారు డాక్టర్‌ను సంప్రదించాకే దీన్ని తీసుకోవడం మంచిది.



# పచ్చి ఉల్లి తినే అలవాటు ఉందా?



సాధారణంగా ఉల్లిపాయలను వంటల్లో ఉడికించి తింటుంటారు. ఇవి వంటలకు రుచిని జోడించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. అయితే కొంత మందికి పచ్చి ఉల్లి తినే అలవాటు ఉంటుంది. చాలా మంది రోజూ వంటల్లో ఉల్లిపాయలను ఉపయోగిస్తుంటారు. ఇవి వంటలకు రుచిని జోడించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. సాధారణంగా వంటలలో వీటిని ఉపయోగించేముందు ఉల్లిపాయలను ఉడికించి లేదా వేయించి వంటలో ఉపయోగిస్తారు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మీకు తెలుసా? పచ్చి ఉల్లిపాయలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. ఉల్లిపాయలను రోజూ తీసుకోవడం వల్ల డయాబెటిస్ లేదా ప్రీ-డయాబెటిస్‌ను తగ్గించవచ్చు. ఉల్లిపాయల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి చాలా మంచివి. పచ్చి ఉల్లిపాయల్లోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా ఇందులో ఫ్లేవనాయిడ్ అనే యాంటీఆక్సిడెంట్ కూడా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. పచ్చి ఉల్లిపాయల్లో ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఉల్లిపాయల్లో ఫైబర్, ప్రీబయోటిక్స్ అధికంగా ఉంటాయి. ఇవి పేగుల ఆరోగ్యానికి చాలా అవసరం. పచ్చి ఉల్లిపాయలు ఆరోగ్యానికి చాలా మంచివి. జీర్ణక్రియను మెరుగుపరచడంలో చాలా సహాయపడతాయి. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీరంలో జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం తగ్గుతుంది.

## డయాబెటీస్ ఉన్న వారు బ్లాక్ బెర్రీస్ తింటే



అలాంటి ఆరోగ్యకరమైన పండ్లలో బ్లాక్ బెర్రీస్ ఒకటి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ బెర్రీస్ తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.. బ్లాక్ బెర్రీస్ లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. మనం రోజు తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకున్నట్లయితే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అంటున్నారు వైద్య నిపుణులు. మన రోజు వారి డైట్‌లో కొన్ని రకాల పండ్లను చేర్చుకుంటే చాలా వరకు అనారోగ్య సమస్యల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని సూచిస్తున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన పండ్లలో బ్లాక్ బెర్రీస్ ఒకటి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ బెర్రీస్ లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, పాలీఫినాల్స్ అధికంగా ఉండటం వల్ల ఒత్తిడిని తట్టుకునే శక్తి ఉంటుంది. వీటిని ప్రతిరోజూ తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బ్లాక్ బెర్రీలో వైద్య పరంగా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. వీటిలో విటమిన్ సి అధికం. ఆరోగ్యానికి చాలా మంచిది. ఎముకల ఆరోగ్యానికి, చర్మ సౌదర్యానికి సహాయపడుతుంది. బ్లాక్ బెర్రీలో తక్కువ కార్బోహైడ్రేట్స్, యాంటీఆక్సిడెంట్లు అధికం. ఈ పండ్లు డయాబెటీస్ వ్యాధి గ్రస్తులకు అద్భుతంగా పనిచేస్తాయి. బ్లాక్ బెర్రీస్‌లో ఫైబర్ తగిన మోతాదులో ఉంటుంది. బ్లాక్ బెర్రీస్‌లో ఫైబర్ తగిన మోతాదులో ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి తగ్గించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బ్లాక్ బెర్రీస్‌ను తరచూ తీసుకోవడం వల్ల మతిమరుపు సమస్యను తగ్గిస్తుంది. బ్లాక్ బెర్రీస్ తింటే చర్మ సంరక్షణకు తోడ్పడుతుంది. మెదడు ఆరోగ్యం పనితీరును మెరుగుపరుస్తుంది. ఎముకల ఆరోగ్యానికి చాలా మంచిది.

## బిజినెస్

### వైద్య బీమాలోకి ఎల్ఐసి




ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) అతి త్వరలోనే వైద్య బీమా రంగంలోకి అడుగు పెట్టనుంది. ఇందుకోసం ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతోంది. ఇదే విషయాన్ని ఎల్ఐసి ఛైర్మన్ సిద్ధార్థ మోహంతి మంగళవారం వెల్లడించారు. వైద్య బీమా కంపెనీలో వాటాల కొనుగోలు అంశంపై మార్చి 31 కల్లా పూర్తి స్పష్టతను ఇవ్వనున్నామని చెప్పారు. అయితే ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేసే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. కాగా.. మెజారిటీ వాటా 51 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటాను మాత్రం కొనుగోలు చేయడం లేద న్నారు. దీంతో మైనార్టీ వాటాను కొనుగోలు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఎల్ఐసి విలువ, బోర్డు నిర్ణయాలు ఇతరత్రా అవకాశాల్ని పరిగణనలోకి తీసుకొని వైద్య బీమా సంస్థలో వాటా కొనుగోలు ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవిత బీమా సంస్థలు పాలసీ తీసుకున్న వ్యక్తులు ఏదైనా కారణంతో ఆసుపత్రిలో చేరితే ఎటువంటి ఆరోగ్య బీమా కవరేజ్‌లను అందించడం లేదు. ఇటీవల మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఎల్ఐసి వాటాలను కొనుగోలు చేస్తోన్నట్లు రిపోర్టులు వచ్చాయి. బీమా రంగంలోకి ప్రవేశించడం ద్వారా తన ఉనికిని మరింత విస్తరించుకోవాలని ఎల్ఐసి లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి స్పష్టత కోసం రెండు వారాలు ఆగాలి. మోహంతి ప్రకటనతో మంగళవారం బిఎస్ఇలో ఎల్ఐసి షేర్ విలువ 1.70 శాతం పెరిగి రూ.757.65 వద్ద ముగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

### ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానం



త్వరలోనే ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధించనున్నారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అత్యున్నతస్థాయి సమావేశం జరిగింది. ఓటర్ ఐడీ, ఆధార్ అనుసంధానంపై ఢిల్లీలో జరిగిన సమావేశంలో చర్చించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవో, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని.. ఓటర్ల గుర్తింపు కార్డుని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఈ విషయంలో మరింత చర్చలు జరపాలని.. సాంకేతిక అంశాలపై త్వరలో ఖ×ణూ× అధికారులతో సంప్రదింపులు చేయనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న క్రమంలో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిల్లో ఏవైనా పరిష్కారం కాని సమస్యలపై ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు ఈసీ తెలిపింది.

# ఎడ్యుకేషన్ లోన్ లేటుగా చెల్లిస్తే ఇంత పెద్ద ప్రయోజనం ఉందా..




ఒక ఎంబీఏ గ్రాడ్యుయేట్ రెడిట్ లో పంచుకున్న పోస్ట్ ఇప్పుడు వైరలవుతోంది. తన ఎడ్యుకేషన్ లోన్ ను చెల్లించడంలో అతడు తీసుకున్న కాల వ్యవధే ఇందుకు కారణం. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బెంగుళూరు పూర్వ విద్యార్థి అయిన తాను తన లోన్ విషయంలో చేసిన పనిని తెలివైనదిగా చెప్పుకుంటున్నాడు. మూడు నుంచి నాలుగేళ్ల పట్టే లోన్ ను తాను ఏకంగా ఎనిమిదేళ్ల పాటు చెల్లించినట్టు చెప్పాడు. ఇతగాడి ఆర్థిక విశ్లేషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఐఐఎం బెంగళూరు నుండి పట్టభద్రుడినయ్యాక కూర్చుని ఎంబీఏ తరహా ఆర్థిక విశ్లేషణ చేసాను. తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ ను తిరిగి చెల్లించడానికి తొందరపడటం ఎందుకని అనిపించింది. నేను తీసుకున్న నిర్ణయాల్లో ఇది అతిపెద్దది. చాలా మంది దీని ట్యాక్స్ ప్రయోజనాలను పట్టించుకోరు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80ఇ కింద, పన్ను చెల్లింపుదారులు ఎనిమిది సంవత్సరాల వరకు చెల్లించే వడ్డీపై 100% పన్ను మినహాయింపు పొందుతారు. అదే మీరు ఒక వేళ రెండు నుంచి మూడేళ్ల లోపు లోన్ తిరిగి చెల్లించేస్తే ఈ ముఖ్యమైన బెనిఫిట్ ను నష్టపోతారు. మనకున్న పూర్తి పీరియడ్ ను ఉపయోగించుకుని ట్యాక్స్ పేయబుల్ ఆదాయాన్ని మనమెందుకు ఆదా చేసుకోకూడదు? అంటూ అతడు ప్రశ్నించాడు. ఇక రెండో కారణం విషయానికొస్తే.. ఈ రెడిట్ యూజర్ రూ. 20 లక్షల రుణం తీసుకున్న రుణగ్రహీత కేసును ఉదాహరణగా చూపించాడు. 9 శాతం వడ్డీతో, రూ. 20 లక్షల అసలు మొత్తం అలాగే ఉండదు. మీరు తిరిగి చెల్లించడం ప్రారంభించే సమయానికి, పెరిగిన వడ్డీ కారణంగా అది రూ. 25-27 లక్షలకు పెరగవచ్చు అని తెలిపాడు. రుణం వడ్డీ విభాగంలో ఎక్కువ భాగాన్ని మొదటి కొన్ని సంవత్సరాలలో బ్యాంకు సేకరిస్తుందని వివరించాడు. ఎందుకంటే ఈఎంఐ వడ్డీ భాగం మొదటి కొన్ని సంవత్సరాలలో ఈ ఎంఐ ప్రధానంగా తిరిగి చెల్లించే భాగం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. "నా డబ్బునంతా త్వరగా తిరిగి చెల్లించడానికి బదులుగా, నేను దానిని పొదుపులు పెట్టుబడులతో బ్యాలెన్స్ చేసుకున్నాను" అని అతడు తెలిపాడు.

# మస్క్‌తో అంబానీ బిగ్ డీల్!



ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్‌కు చెందిన ఏరో స్పేస్ కంపెనీ స్పేస్ ఎక్స్‌తో.. రిలయన్స్ ఇండిస్ట్రీస్ అధినేత, భారత అపరకుబేరుడు ముకేశ్ అంబానీ డీల్ చేసుకున్నారు. రిలయన్స్ గ్రూప్ డిజిటల్ సంస్థ అయిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్.. స్పేస్ ఎక్స్‌కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థగా ఉన్నటువంటి స్టార్ లింక్ సర్వీసెస్‌తో జట్టుకట్టింది. ఇది శాటిలైట్ ఆధారిత టెలికాం సేవలను అందిస్తుండగా ఇప్పుడు భారత్‌లో జియో కోసం పనిచేయనుంది. అయితే.. మార్చి 11 న భారతీ ఎయిర్‌టెల్ కూడా ఇదే స్టార్ లింక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరుసటి రోజే జియో అలాంటి డీల్‌ను కుదుర్చుకోవడం విశేషం. దేశీయంగా ప్రత్యర్థులుగా ఉన్న జియో, ఎయిర్‌టెల్‌కు ఇప్పుడు ఒకే సంస్థ.. భారత్‌లో శాటిలైట్ హైస్పీడ్ ఇంటర్నెట్ సర్వీసులను అందిస్తుందన్న మాట. భారత్‌లోనూ స్టార్ లింక్ సంస్థకు అనుమతులు లభించిన తర్వాత.. ఈ రెండు సంస్థలు అంటే జియో, ఎయిర్‌టెల్ శాటిలైట్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నాయని చెప్పొచ్చు. ఈ మేరకు మార్చి 12న జియో.. ఈ ఒప్పందం గురించి వెల్లడించింది. తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఒప్పందం వివరాల్ని ప్రస్తావించింది. 'అందరికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించేందుకు.. ఈ భాగస్వామ్యం ఒక కీలక అడుగు. జియో బ్రాడ్‌బ్యాండ్ సిస్టమ్‌తో స్టార్ లింక్‌ను లింక్ చేయడం ద్వారా మా పరిధి మరింత విస్తరించనున్నాం. ఈ డీల్ అనేది ఏఐ ఆధారిత యుగంలో కూడా హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ విశ్వసనీయతను మరింత పెంచడంలో దోహదపడుతుంది.' అని జియో వెల్లడించింది. జియో తన రిటైల్ అవుట్‌లెట్స్ సహా ఆన్‌లైన్ వేదికగా స్టార్ లింక్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించింది. పరస్పరం తమ ప్రయోజనాల్ని అందిపుచ్చుకొని రెండు కంపెనీలు ముందుకు సాగనున్నట్లు జియో.. తన ప్రకటనలో వెల్లడించింది. దీనికి ముందు రోజే.. ఎయిర్‌టెల్ స్టార్ లింక్ ఒప్పందం గురించి వివరించింది. స్టార్ లింక్‌తో ఒప్పందం ద్వారా.. దేశంలోని మారుమూల గ్రామాలకు కూడా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు కళషి చేస్తామని స్పష్టం చేసింది.

## స్పోర్ట్స్

# ఐపీఎల్ కోల్‌కతా టైటిల్ నిలబెట్టుకునేనా?




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్-18 మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ (కెకెఆర్) డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. 2024 సీజన్‌లో ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన కోల్‌కతా ముచ్చటగా మూడోసారి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. టైటిల్‌ను చేజిక్కించు కొనే క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను క్వాలిఫయర్-1తో పాటు ఫైనల్‌లోనూ చిత్తు చేసి హ్యాట్రిక్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. కానీ ఈసారి కోల్‌కతాకు పెను సవాళ్లు ఎదురవుతున్నాయి. దశాబ్ది విరామం తర్వాత తమకు ట్రోఫీని అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను సైతం పక్కనబెట్టి అతడిని వేలానికి వదిలేసిన కెకెఆర్ యాజమాన్యం పెద్ద తప్పే చేసింది. ఈ క్రమంలోనే ఈ ఫార్మాట్‌లో గొప్ప రికార్డేమీ లేని అజింక్యా రహానేకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. శ్రేయస్‌ను వదులుకున్న కెకెఆర్ యాజమాన్యం వేలంలో వెంకటేశ్ అయ్యర్‌ను ఏకంగా రూ. 23.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. ఈ క్రమంలో అతడికే సారథ్య పగ్గాలు అప్పజెప్పుతారని అంతా భావించినా.. టీమ్ మేనేజ్‌మెంట్ అనూహ్యంగా రహానేను కెప్టెన్‌గా, వెంకటేశ్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. వీరు ఈసారి కెకెఆర్‌ను ఏ మేరకు ముందుకు తీసుకెళ్తారనేది ఊహాజనితం. రహానే గతేడాది జరిగిన సయ్యిద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో 164.56 సగటుతో టాప్ స్కోరర్(469)గా నిలిచాడు. ఇక 2021 నుంచి కోల్‌కతాకు ఆడుతూ గత సీజన్‌లో 46 సగటుతో 370 పరుగులు చేసిన వెంకటేశ్ మిడిలార్డర్‌లో అత్యంత కీలకం. తనదైన రోజున అతడి విధ్వంసం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుంది. మిడిలార్డర్‌తో పాటు లోయరార్డర్‌లో దుర్భేధ్యమైన లైనప్ కెకెఆర్ సొంతం. సిక్సర్ల రింకూ సింగ్, హార్డ్ హిట్టర్లు ఆండ్రీ రస్సెల్, మన్‌దీప్ సింగ్ వంటి నాణ్యమైన ఫినిషర్లు కోల్‌కతాకు ఉన్నారు. ఇక భారత చాంపియన్స్ ట్రోఫీలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి నైట్‌రైడర్స్‌కు వెలకట్టలేని ఆస్తి. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్‌కు సహకరించే ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై అతడు అత్యంత ప్రమాదకారి. నరైన్‌కు అండగా వరుణ్ మ్యాజిక్ చేస్తే ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టడం ఖాయం.

### అప్పుడు విరాట్‌తో కలిసి.. ఇప్పుడు ఐపిఎల్ అంపైర్‌గా




2008లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌ను భారత్ దక్కించుకుంది. ఈ టోర్నమెంట్‌లో టీం ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ భారత్ జట్టుకు కెప్టెన్‌గా ఉండగా.. మరో స్టార్ ఆటగాడు రవీంద్ర జడేజా కూడా ఈ జట్టులో సభ్యుడే. అయితే ఈ టీంలో ఆడిన ఓ ఆటగాడు ఇప్పుడు ఐపిఎల్‌కు అంపైర్‌గా రానున్నాడు. 2008 అండర్-19 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తన్మయ్ శ్రీవాస్తవ ఇప్పుడు ఐపిఎల్‌కు అంపైర్‌గా రానున్నాడు. తన్మయ్ శ్రీవాస్తవ సొంత రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన క్రికెట్ అసోసియేషన్ ఈ విషయాన్ని వెల్లడించింది, 'నిజమైన ఆటగాడు ఎప్పుడు మైదానం విడిచిపెట్టడు. అతని పాత్ర మాత్రమే మారింది. ఈ కొత్త ప్రయాణంలో తన్మయ్‌కి ఆల్ ది బెస్ట్" అంటూ ఉత్తర్‌ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అండర్-19 జట్టులో అద్భుత ప్రదర్శన చేసినా.. అతనికి పెద్దగా అవకాశాలు రాలేదు. 2008-12 వరకూ ఐపిఎల్‌లో ఆడిన అతను 7 మ్యాచుల్లో 8 పరుగులు మాత్రమే చేశాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో 90 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, 44 లిస్ట్-ఎ, 34 టి-20లు ఆడి 7వేలకు పైగా పరుగులు చేశాడు. ఇందులో 17 సెంచరీలు, 81 హాఫ్ సెంచర్నీల ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇచ్చిన తన్మయ్.. దేశవాలీ క్రికెట్‌లో అంపైర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# కీలక నిర్ణయంపై బీసీసీఐ యూటర్న్?

ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడింది. తొలి టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో ఆ జట్టు 3 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడగా, ఒక మ్యాచ్ డ్రా అయింది. భారత జట్టు పేలవ ప్రదర్శన తర్వాత బీసీసీఐ కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఇప్పుడు ఇండియా టుడే ప్రకారం.. బీసీసీఐ తన నిర్ణయం నుండి వెనక్కి తగ్గవచ్చు. బీసీసీఐ అధికారి ఒకరు ఇండియా టుడేతో మాట్లాడుతూ.. ఆటగాళ్లు తమ కుటుంబాలను, సన్నిహిత వ్యక్తులను ఎక్కువ కాలం పర్యటనలో ఉంచాలనుకుంటే, భారత క్రికెట్ నియంత్రణ మండలి తన నిబంధనలను మార్చడాన్ని పరిగణించవచ్చని ఆయన తెలిపారు. అయితే అలా చేయడానికి ముందు ఆటగాళ్లకు బోర్డు అనుమతి అవసరం. ఆటగాళ్లు తమ కుటుంబాలు ఎక్కువ కాలం పర్యటనలో ఉండాలని కోరుకుంటే వారు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బీసీసీఐ తన సొంత నిర్ణయం ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటన తర్వాత ఆటగాళ్లు వారి కుటుంబాలతో ప్రయాణించకుండా నిషేధిస్తూ బీసీసీఐ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బోర్డు తీసుకున్న ఈ నిర్ణయంపై విరాట్ కోహ్లీ, కపిల్ దేవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే భారత జట్టు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పుడు భారత ఆటగాళ్ళు ఐపీఎల్‌లో బిజీగా ఉంటారు. మార్చి 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. దీని తర్వాత భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. ఈ సమయంలో రెండు జట్ల మధ్య 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడతారు. జూన్



20 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుండగా, చివరి టెస్ట్ మ్యాచ్ జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు జరుగుతుంది.



## మరి ఇంత బోల్డ్‌గానా.. జినాల్ జోషి ఫోటోలు వైరల్



# పార్లమెంట్‌కి వెళుతున్న రామ్ చరణ్.. నమ్మలేకపోతున్నారా!

ఏంటి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పార్లమెంట్‌కి వెళుతున్నారా, ఇది నిజమా అని మీలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి కదా. రియల్ లైఫ్‌లో కాదు కాని రీల్ లైఫ్‌లో పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నాడట రామ్ చరణ్. త్వరలో సినిమా షూటింగ్ కోసం యూనిట్ సభ్యులు ఢిల్లీ వెళ్లనున్నట్టు తెలుస్తుంది. కథలో భాగంగా కొన్ని కీలక సన్నివేశాలను ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో చిత్రీకరించాల్సి ఉందట. అంతే కాకుండా జామా మసీదు పరిసర ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్ నిర్వహించేందుకు బుచ్చిబాబు ప్లాన్ చేయడంతో నిర్మాతలు పర్మిషన్స్ కూడా తీసుకున్నారని సమాచారం. త్వరలోనే చరణ్‌తో పాటు కీలక నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందం ఢిల్లీ వెళ్లే అవకాశాలు ఉన్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొన్నటి వరకు హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో, శివారు ప్రాంతంలో షూటింగ్ జరుపుకుంది. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ వివిధ ఆటలు ఆడతాడని సమాచారం. సాధారణంగా స్పోర్ట్స్ డ్రామా అంటే ఒకే ఆట నేపథ్యంలో ఉంటుంది. కాని ఈ చిత్రంలో రామ్ చరణ్ పలు ఆటలు ఆడతాడట. ఆట కూలీ పాత్రలో రామ్ చరణ్ కనిపించబోతున్నారని వార్తలు వస్తుండగా, దీనిపై క్లారిటీ రావలసి ఉంది. ఇటీవలి కాలంలో ఎప్పుడూ చూడని వైవిధ్యభరిత కాన్సెప్ట్‌తో ఈ సినిమాని రూపొందించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమా టీజర్‌ని రామ్ చరణ్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో సినిమా టైటిల్‌ను రివీల్ చేసే అవకాశం కూడా కనిపిస్తుంది. ఇదే ఏడాదిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్‌తో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఏ ఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్న నేపథ్యంలో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది.



# ఆ దర్శకుడితో నాగార్జున 100వ సినిమా?

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్.. ఈ నలుగురిని టాలీవుడ్‌కి నాలుగు స్తంభాలు అంటారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యధిక సినిమాలలో హీరోలుగా నటించింది వీరే. చిరంజీవి ఇప్పటికే 156 చిత్రాలకు పైగా నటించగా.. బాలకృష్ణ కూడా సెంచరీ పూర్తి చేశాడు. ఇక ఇప్పుడు నాగార్జున(%చీఝస్త్రుఖతీయబఊఖ%) తన 100వ సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే హీరోగా 99 చిత్రాల్లో నటించిన నాగ్.. తన సెంచరీ మూవీ కోసం ఆచి తూచి వ్యవహరిస్తున్నాడు. నాగ్ సోలో హీరోగా నటించిన చివరి చిత్రం 'నా సామి రంగ'. ఇది గతేడాది సంక్రాంతికి ఈ సినిమా రిలీజైంది. ఆ తర్వాత సోలో సినిమా ఇంత వరకూ ప్రకటించలేదు. ఇప్పుడు తన బెంచ్ మార్క్ సినిమా కోసం అదిరిపోయే ప్లాన్ వేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. కింగ్ నాగ్ నటించబోయే 100వ సినిమాని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మార్చేందుకు స్కెచ్ వేస్తున్నట్లు ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది ప్రస్తుతం నాగార్జున 'కుబేర', 'కూలీ' చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఇవి పూర్తయిన తర్వాత 100వ సినిమా ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. తాజా వార్తల ప్రకారం, ఈ చిత్రానికి తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వం వహించనున్నారని సమాచారం. కార్తీక్ గతంలో తమిళంలో 'నితం ఓరువానం" చిత్రానికి దర్శకత్వం వహించారు.ఈ సినిమా తెలుగులో 'ఆకాశం' పేరుతో డబ్ అయ్యింది. ఇక్కడ ఆశించిన స్థాయిలో ఆ చిత్రం ఆడలేదు కానీ దర్శకుడు కథను తెరపై చూపించిన విధానం నాగ్‌కి బాగా నచ్చిందట. వెంటనే అతన్ని పిలిపించి..వందో చిత్రం బాధ్యతలు అప్పజెప్పాడట. తన 100వ విజువల్ వండర్‌గా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలని నాగ్ కోరుకుంటున్నట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నిన్న మొన్నటి వరకు నాగార్జున వందో చిత్రానికి పూరి జగన్నాథ్, బెజవాడ ప్రసన్న కుమార్, తమిళ్ డైరెక్టర్ మోహన్ రాజా, నవీన్ పేర్లు గట్టిగా వినిపించాయి.. అయితే, తాజా సమాచారం ప్రకారం కార్తీక్‌తోనే ఈ ప్రాజెక్ట్ ఖరారైనట్లు కనిపిస్తోంది. షూటింగ్ ఈ ఏడాది చివరలో లేదా 2026 ప్రారంభంలో మొదలయ్యే అవకాశం ఉంది. నాగ్ అభిమానులకు ఆకట్టుకునేలా ఓ సూపర్ స్టోరీని రెడీ చేశాడట కార్తీక్. రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా రేంజ్ లో నాగ్ సెంచరీ మూవీని తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నారట. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



# మోహన్ బాబు బర్త్ డే స్పెషల్.. మహదేవ శాస్త్రి గ్లింప్స్ చూశారా?

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తోన్న చిత్రం కన్నప్ప. ఈ మూవీని ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా భారీ బడ్జెట్‌తో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలోని పలువురు అగ్రతారల ఫస్ట్ లుక్ పోస్టర్లను ఆడియన్స్‌కు పరిచయం చేశారు. ఈ మూవీలో మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో మోహన్ బాబు మహదేవ శాస్త్రి పాత్రలో అభిమానులను అలరించనున్నారు. ఇవాళ ఆయన పుట్టిన రోజు కావడంతో ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహదేవ శాస్త్రి పాత్రను పరిచయం చేసే సాంగ్‌ను గ్లింప్స్ రూపంలో రిలీజ్ చేశారు. ఈ పాటను ఒకేసారి ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఆడియన్స్‌కు పరిచయం చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com